ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం


గురువారం, మార్చి 19, 2026 | సంపుటి - 22 | సంచిక 171 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## మధ్యవర్తితో అవినీతి.. ఏసీబీ తీసింది గోతి.!

- పట్టుబడ్డ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రాము
- మధ్యవర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అరెస్ట్
- జగిత్యాలలో ఇన్స్పెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 18 (నినాదం):**

రాష్ట్రంలో అవినీతి రాజ్యం ఏలుతుంది. ప్రభుత్వాలు నడపడం కోసం ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ శాఖ ను కల్పవృక్షంగా తయారు చేశారు. మద్యం అమ్మకాలు టార్గెట్ పెట్టి రాష్ట్ర ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఇదే అదునుగా చూసి ఎక్సైజ్ శాఖలో అవినీతి తిమింగలాలు బెల్ట్ షాపులు, వైన్ షాప్ ల నిర్వాహకుల, బెల్లం వ్యాపారుల నుంచి అక్రమంగా వసూ లు చేసి కోట్లు కూడా పెడుతున్నారు. ఈ తరహాలోనే అడ్డగోలు అక్రమార్జన చేసిన ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రాము ఏసీపీకి పట్టుబడిన సంఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది.

2





పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
నినాదం ఉగాది శుభాకాంక్షలు


# మిల్లర్ల బరితెగింపు

- ఆగని బియ్యం స్మగ్లింగ్
- ఆ 3 మిల్లులకు ఫుల్లుగా రేషన్ రైస్
- కాగజ్ నగర్ లో కానరాని నియంత్రణ
- సీఎం ఆదేశాలూ బేఖాతరు



తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ మిల్లు

**కాగజ్ నగర్,మార్చి18(నినాదం):**

కళ్లకు కట్టినట్లు మీడియా చూపుతున్నా, నిజాయితీగల అధికారులు కాపలాకాస్తున్నా, చివరకు ముఖ్యమంత్రే ఆదేశించినా కాగజ్ నగర్ లో రేషన్ మాఫియా మాత్రం ఆగటంలేదు. ప్రముఖంగా ఓ ముగ్గురు మిల్లర్ల బరితెగింపు అంతాఇంతాకాదని స్పష్టమవుతోంది. సిఎంఆర్ డిఫాల్టర్లకు కల్పతరువుగా మారిన సదరు ఈ మిల్లర్లు ఎవ్వరినీ లెక్కచేయటంలేదు.పట్టపగలే షెటర్లు తెరిచి దర్జాగా పీడీఎస్ బియ్యం కొంటున్నారు.కాగా ఇంత బాహాటంగా పేదల బియ్యం స్మగ్లింగ్ కు గురవుతుంటే సంబంధిత సివిల్ సప్లై బాధ్యులు,స్థానిక పోలీసులేం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సీఎంఆర్ ల బకాయిలవిషయంలో సీఎం సీరియస్ గా ఉన్నారని తెలిసీ ఇక్కడి మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు ఆసక్తిగా మారింది.వెరసీ అధికారుల చర్యల లోపం వీరికి వరంగామారిందని స్థానికంగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా ఇప్పటికైనా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ బాధ్యులు దీనిపై దృష్టిసారించాలని సామాజికవాదులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉండగా పట్టణంలోని పెద్దవాగు సమీపంలో గల ఓ రైస్ మిల్లర్ బుధవారం పీడీఎస్ రైస్ అన్ లోడ్ చేసుకుంటున్న ఫొటో ఒకటి నినాదం కెమెరాకు చిక్కటం కొసమెరుపు.!



ప్లాస్టిక్ బ్యాగుల్లోంచి తీసి ఏసికేలకు సిద్ధం చేస్తున్న పీడీఎస్



## మూసీ ప్రక్షాళనపై వాదోపవాదాలు

- మూసీని అడ్డుకుంటున్న విపక్ష బిఆర్ ఎస్
- రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డ భట్టి
- డిపిఆర్ సిద్ధం చేశామన్న మంత్రి శ్రీధర్ బాబు

2

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ మరియు ప్రతిపక్ష బీఆరఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు మాట్లాడారు.



## రాష్ట్రాలకు అదనంగా పదిశాతం ఎల్‌పిజి

### తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, నినాదం:**

ఇరాన్, అమెరికా`ఇజ్రాయెల్ మధ్య యుదం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది.

2

## పాన్‌తో ఆధార్ లింక్

మార్చి 31 వరకు గడువు



2

కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది.

# తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించాం



**హైదరాబాద్,మార్చి18(నినాదం):**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. 'రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై సీఎం మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం.

### చేసిందీ.. చేయబోయేది స్పష్టం చేశాం

### గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం

- సూచనలు ఇచ్చే ప్రయత్నం చేయని విపక్షం
- గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా రాని కెసిఆర్
- ఇంకా అహంకార ధోరణి వీడని కొందరు నేతలు
- కెసిఆర్ సభకు వచ్చి సూచనలు సలహాలు ఇవ్వాలి
- జీతాలు తీసుకుంటూ సభకు రాకుంటే ఎలా
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సిఎం సమాధానం

2

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో..పోతున్నదో ఇందులో వివరించామని అన్నారు. తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిందన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు.



## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి

### మొయినాబాద్ కేసులో కొత్తకోణం

మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ గుర్తింపు



2

## పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

- ఇలాంటి వాళ్లను పార్టీ ఎందుకు మోయాలి
- తిరుపతి ఎమ్మెల్యేలతో ఏపీ సిఎం చంద్రబాబు



# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా
- మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్

2



**హైదరాబాద్,మార్చి18(నినాదం):**

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆరఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆరఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు.

# హార్మూజ్ వద్ద భారీ సైనిక చర్య

- ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు
- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి
- 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం
- అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్

వివరాలు 2




## మధ్యవర్తితో అవినీతి.. ఏసీబీ తీసింది గోతి.!

ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రాము ఇంట్లో మంగళవారం రాత్రి 8:30 కు సోదరులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. గుండేటి రాముకు అవినీతి సొమ్మును తీసుకోవడంలో మధ్యవర్తిత్వం వహించిన జక్కని వేణు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రాము వేములవాడలో ఎస్హెచ్ఓగా పని చేసినప్పుడు ఒక బెల్లం వ్యాపారి నుండి అక్రమంగా భారీ లంచాలు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. అవినీతి లావాదేవీలను జక్కని వేణు ద్వారా 2022 నుంచి 2024 వరకు యూపీఐ ద్వారా నిరంతరం జరిగిన లావాదేవీలను ఏసీబీ అధికారులు బ్యాంకు ఖాతాల నుండి మొత్తాన్ని గుండేటి రాము తండ్రి ఖా తకు బదిలీ చేసినట్లు గుర్తించారు. గుండేటి రాము ఇంటిపై జరిగిన సోదాలు సుమారు 20 లక్షలు లెక్కలేని నగదు లభించగా బంగారు ఆభరణాలు ఇంటి పత్రాలు బినామీ పేర్ల మీద ఉన్న ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రామును ఏవన్ గా జక్కని వేణును ఎటుగా చేర్చి కేసు నమోదు చేసి కరీంనగర్లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉండగా ఫిర్యాదుదారులు వివరాలను భద్రత కారణాలవల్ల గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## రాష్ట్రాలకు అదనంగా పదిశాతం ఎల్పిజి

అయితే ఎల్పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది. దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికీ ఆన్లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

**న్యూఢిల్లీ, నినాదం:**

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

## మొయినాబాద్ కేసులో కొత్తకోణం

హైదరాబాద్ : మొయినాబాద్ ఫార్మ్ హౌస్ డ్రగ్స్ కేస్ లో కొత్త కోణం వెలుగు చూసింది. ఫార్మ్ హౌస్ పార్టీలో నిందితులు మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ బదం గుర్తించింది. కోకేన్, ఎండిఎంఏ డ్రగ్స్ వాడినట్లు గుర్తించింది. ముఖ్యంగా నమిత్ శర్మ మూడు రకాలు వాడినట్లు నిర్ధారించారు. పైలట్ రోహిత్ రెడ్డి రెండు రకాల డ్రగ్స్ వాడినట్లు అధికారులు తేల్చారు. ఇక అర్జున్ రెడ్డితో పాటు మిగిలిన నిందితులు ఎండిఎంఏతో పాటు మేతోతిపెన్ వాడినట్లు తెలిపారు. పోలీసులు అధిక కిక్ కోసం రోహిత్ నమిత్ శర్మ కాస్ట్లీ మద్యంతో పాటు డ్రగ్స్ కలిపి తీసుకున్నట్లు గుర్తించారు పోలీసులు. పార్టీకి సిమ్లా నుంచి కౌశిక్ డ్రగ్స్ తీసుకొచ్చినట్లు నిర్ధారించారు అధికారులు. అభిషేక్ నుంచి రెండు రకాల డ్రగ్స్ కొనుగోలు చేశాడు. పైలట్ డ్రైవర్ రోహిత్ ఓఆరఆర్ దగ్గర కొనుగోలు చేసినట్లు తేల్చారు.అడ్వకేట్ కౌశిక రవి తాను బిజినెస్ ట్రిప్ కోసం సిమ్లాకి వెళ్ళినప్పుడు అక్కడికి గుర్తు తెలిన వ్యక్తుల దగ్గర నుంచి దాదాపు 15,000 రూపాయలు చెల్లించి తీసుకొని వచ్చినట్లుగా పేర్కొన్నారు. అయితే మిగతా డ్రగ్స్ మిగతా రెండు రకాల డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి అనే విషయం తెలుసుకున్నప్పుడు పైలట్ రోహిత్ డ్రైవర్ అయిన శరత్ ఈ రెండు రకాల డ్రగ్స్ తెచ్చినట్లుగా అధికారులు గుర్తించారు.

## పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

**అమరావతి, నినాదం:**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్పై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి వాళ్లను మోయాలా..? అంటూ ఈ సమావేశంలో ఆయన అసహనం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహరించారన్నారు. అసలు ఆ పార్టీలకు వెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వాళ్లు ఎంతటి పెద్ద వాళ్ళైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నానని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. క్రమశిక్షణ, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో నాయకులంతా క్రమశిక్షణతో మెలగాల్సిందేనని.. ఎవరికీ వెసులుబాటు ఉండదని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## పాన్తో ఆధార్ లింక్

**న్యూఢిల్లీ, నినాదం:**

కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమనే సంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది. అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఎప్రిల్ ఒకటి తర్వాత పాత పాన్ దరఖాస్తు ఫారాలను కూడా అనుమతించేది ఉండదని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచి పాన్ దరఖాస్తు ఫారాలు కూడా మారతాయని, కొత్తవి అందుబాటులోకి వస్తాయని కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది.

## ఐ`ప్యాక్ కార్యాలయంపై ఇడి దాడులు

**మమత అడ్డుకోవడంపై సుప్రీం సీరియస్**

న్యూఢిల్లీ : కోల్కతాలోని ఐ`ప్యాక్ కార్యాలయంపై ఇటీవల ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ దాడులు జరిపిన సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇది హర్షించదగిన పరిణామం కాదని పేర్కొంది. ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో కేంద్ర ఏజెన్సీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మమతాబెనర్జీ జోక్యంపై ఈడీ వేసిన పిటిషన్పై న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం బుధవారంనాడు విచారణ జరిపింది. 'రేపటి రోజు ఇలాంటి రైడ్స్ జరిగినప్పుడు మరో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటే పరిస్థితి ఏమిటి? ఈడీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా?' అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. ఎలక్షన్ కన్సల్టెన్సీ ఐ`ప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ నివాసంపై దాడుల సందర్భంగా ముఖ్యమంత్రి చర్యలను ఈడీ తన పిటిషన్లో తప్పుపట్టింది.

# తెలంగాణ విజన్ను ఆవిష్కరించాం

గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇదే సందర్భంలో బీఆరఎస్ అధినేత కేసీఆర్పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆరఎస్ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటీ 6 లక్షలకు పైగా జీతభత్యాలు పొందారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని అన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ విధానాలే కారణం. పీవీ నరసింహారావు, నేదురుమల్లి జనార్దన్రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు.
అనంతరం చంద్రబాబు, వాజ్పేయీ హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్ను సభలో ప్రవేశపెట్టాం' అని సీఎం అన్నారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్గా నిలిచిందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్రెడ్డి వ్యాఖ్యానించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని ఉద్ఘాటించారు. గవర్నర్ చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదని.. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని వ్యాఖ్యానించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని తెలిపారు. అలాంటి గొప్ప సంకల్పాన్ని, పవిత్ర శాసన సభ వేదిక నుంచి రాష్ట్ర ప్రజల ముందు ఉంచిన గవర్నర్ శుక్లాకి ఈ సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ వస్తారని అనుకున్నామని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. కొత్త గవర్నర్కు కేసీఆర్ శుభాకాంక్షలు చెబుతారని భావించామని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదని ప్రశ్నించారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా బీఆరఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన



ప్రతిపక్ష నాయకుడు రూ.1.6కోట్లకు పైగా జీతభత్యాలు పొందారని ప్రస్తావించారు. అసెంబ్లీలో కేసీఆర్ తన విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని అన్నారు.ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారని అన్నారు. సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. నెహ్రూ తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉందని తెలిపారు. మొదటి తరంలో నెహ్రూ` ఇందిరా గాంధీ గొప్ప విధానాలు తీసుకువచ్చారని ఉద్ఘాటించారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసింహారావుదని తెలిపారు. 1990 నుంచి 2020 వరకు 30 ఏళ్లు పీవీ నరసింహారావు నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఏఐ సునామి రాబోతుందని చెప్పుకొచ్చారు. దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్ను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ `2047 విజన్ డాక్యుమెంట్ను కనీసం చదివారా..? చూశారా..? అని సీఎం రేవంత్రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించకపోతే తర్వాత తరాలు మనల్ని క్షమించవని హితవు పలికారు. ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయమని నొక్కిచెప్పారు.

. అందుకే ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్`2047 విజన్ డాక్యుమెంట్ను రూపొందించుకున్నామని వివరించారు. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్గా విభజించుకున్నామని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు.

## మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో వాదోపవాదాలు

మూసీ ప్రక్షాళనను బీఆరఎస్ అడ్డుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ ప్రాజెక్టుపై బీఆరఎస్ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాలను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, ప్రతిపక్షం మాత్రం రాజకీయ లబ్ది కోసం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు. మూసీ నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బాధితులకు అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్మెంట్లు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నిరుపేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, కానీ నిర్వాసితులు మురికి కూపంలోనే మగ్గిపోవాలని బీఆరఎస్ కోరుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్రం చేయడం మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్బాబు మాట్లాడుతూ మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని.. 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు. అనంతరం బీఆరఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్బాబు సమాధానం సంతృప్తిగా లేదన్నారు. శాసనసభ నుంచి బీఆరఎస్ వాకౌట్ చేసింది. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. 'ప్రభుత్వం దగ్గర నిధులు లేవు.. ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

## మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

డీపీఆర్ కూడా సబ్మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆరఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆరఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా



వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆరఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్కు బీఆరఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు.

మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# హర్మ్యూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య

వాషింగ్టన్, నినాదం:

హోర్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సెల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టెర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సెల్లు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హోర్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

## ఇరాన్కు వరుస ఎదురు దెబ్బలు

సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత ఇరాన్కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు.



ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతి చెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్తో శాంతి కుదరదని చెప్పారు.

# సన్న బియ్యం పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి






**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**జిల్లాకు 25 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా లక్ష్యం.....**

**మూడు నెలల రేషన్ స్టాక్ పంపిణీపై అధికారులతో సమీక్ష సమావేశం**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి18: (నినాదం ):** సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో మూడు నెలల రేషన్ స్టాక్ పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ నుండి జూన్ 2026 వరకు గల మూడు నెలల రేషన్‌ను ఒకేసారి లబ్ధిదారులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మూడు నెలల రేషన్ సరఫరా సమర్థవంతం గా జరిగేందుకు 12 బఫర్ గోదాము లకు 12 మంది జిపిఓలను ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు చెప్పారు. రేషన్ షాపుల వారీగా సరైన విధంగా స్టాక్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బఫర్ గోదాంల నుండి స్టేజి-1 ద్వారా ఎం.ఎల్.ఎస్ పాయింట్లకు బియ్యం సరఫరా సకాలంలో జరగాలని, జిల్లా అవసరాలకు 25 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా లక్ష్యంగా ఉంచినట్లు తెలిపారు. ఇతర జిల్లాలకు పంపిణీ చేసే బియ్యం పరిమాణం కూడా సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచే బియ్యం పంపిణీ ప్రారంభం కావాలని, ఎం.ఎల్.ఎస్ పాయింట్ల నుండి రేషన్ దుకాణాలకు బియ్యం తరలింపు కూడా అదే సమయానికి ప్రారంభించాలన్నారు. హమాలీలు సమయానికి అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎం.ఎల్.ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు, స్టేజి-1 కాంట్రాక్టర్లు, గోదాం ఇన్‌చార్జ్‌లు, జిపిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వాత్సల్య మందిరానికి నీటి ప్యూరిఫైయర్ అందజేత




**నాగర్ కర్నూల్ మార్చి 18 (నినాదం):** నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీజ్ఞానేశ్వర వాత్సల్య అరక్షిత బాలికల మందిరానికి 35 విలువగల నీటి ప్యూరిఫైయర్ ను లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. 320గా లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి ప్యూరిఫైయర్ ను ప్రారంభించారు. అరక్షిత బాలికల నీటి దాహార్తిని తీర్చుటకు ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా శ్రీశైలం వెళ్తున్న శివ భక్తులకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు హకీమ్ విశ్వ ప్రసాద్, రాధాకృష్ణ, నరేందర్ రెడ్డి సురేష్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, ఆశ్రమ మహిళ వార్డెన్ కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF III SENIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT L.B. NAGAR
O.S. NO. 45 of 2025

Between:
D. Shravathl ... PLAINTIFF
AND
Satyanrayana and others .. DEFENDANTS

Satyanrayana son of late Sanjeeva Rao, aged about 68 years, occupation : business, resident of h.No. 10-11-151/1, Sitaram Nagar, Anand nagar, Nizamabad District

TAKE notice that the plaintiff has filed the above suit against you and others seeking declaration and recovery of possession of the suit schedule property.

NOW the above case stands posted to 02.04.2026 for your appearance and reply. As such you are hereby called upon to appear before the above Court on 02.04.2026 at 10.30 A.M. in person and or through Advocate. Otherwise the matter will be proceeded further by setting you exparte.

(BY ORDER OF THE COURT)
S. NARSIMHA REDDY,
ADVOCATE
Plot No. 60/E,
S.N. Reddy nagar,
Champapet,
Hyderabad - 500 079
mobile 94934 07003

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం: కలెక్టర్ అనుదీప్







**196 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం**

**నగరాభివృద్ధికి భారీ బడ్జెట్... 2026-27 అంచనాలు వెల్లడి**

**ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి,మార్చి 18(నినాదం)** ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.196 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, హైదరాబాద్ తర్వాత ఖమ్మం ముఖ్యమైన కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవ లు అందించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వ యంతో పని చేస్తూ క్షేత్రస్థాయిలో అనేక సమస్య లను పరిష్కరించారని అభినందిం చారు. చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రత, వీధి దీపాలు, తాగు నీటి సరఫరా వంటి సేవలను నిరం తరం పర్యవేక్షిం చాలని సూచిం చారు. స్ట్రీట్ లైట్ల మానిటరింగ్ కోసం సెంట్రల్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో ఎక్కడా చీకట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, మరమ్మత్తులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించా లని, ప్రారంభం కాని ఇళ్ల విషయంలో అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయింపులు జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ మొదటి వారానికి జిల్లాలో 10 వేల ఇళ్లు పూర్తవుతాయని తెలిపారు. నగ రంలో ఆస్తుల పునఃమూల్యాం కనం చేసి ఆస్తి పన్నులను సవరించాలని, కార్పొరేషన్ స్వంత ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించేందుకు క్యూ ఆర్ కోడ్ వ్యవస్థ ప్రవేశపెట్టాలని తెలిపారు. అలాగే రోడ్ల తవ్వకాల తర్వాత పునరుద్ధరణ తప్పనిసరి గా చేపట్టాలని స్పష్టం చేశారురాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను సాంకేతిక పద్ధతులతో నియంత్రించి జరిమా నాలు విధించాలని సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అమృత్ పథకం, ఎస్‌టీపీ నిర్మాణం, ఖమ్మం ఖిల్లా రోప్‌వే వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ...**

నగర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తు న్నామని తెలిపారు. కార్పొరేటర్లు తమ తమ డివిజన్ల సమస్యలను సమావే శంలో ప్రస్తావించగా, వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని కోరారు. బడ్జెట్ వివరాలను నగరపాలక సంస్థ అధికారులు సభకు వివరించారు. పన్నుల ద్వారా రూ.50.43 కోట్లు, పన్నేతర వనరుల ద్వారా రూ.96.94 కోట్లు ఆదాయం అంచనా వేయగా, వివిధ అభివృద్ధి, నిర్వహణ ఖర్చులకు భారీగా నిధులు కేటాయించారు. సమావేశంలో కార్పొరేటర్లు పారిశుద్ధ్యం, వీధిలైట్లు, పన్నుల వసూళ్లు, పబ్లిక్ సదుపాయాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. నగర అభివృద్ధికి సంబంధించి చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారు లను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్లు, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంత్రి జూపల్లి ఉగాది శుభాకాంక్షలు



**గద్వాల బ్యూరో మార్చి 19 (నినాదం)** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరా భవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణిం చారు. పండుగలు, ఆచార వ్యవహా రాలు, సంస్కృతి సంప్రదా యాలు, కళలు... జాతిని సజీవంగా నిలుపుతా యని తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో.. ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరి స్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని

# ఎండలు పెరుగుతున్న వేళ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## మెడికవర్ హాస్పిటల్స్ జనరల్ ఫిజీషియన్ ఆనంద్ మాలు



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 18 (నినాదం ) :** వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డా. ఆనంద్ మాలు, జనరల్ ఫిజీషియన్, మెడికవర్ హాస్పిటల్స్, నిజామాబాద్ సూచించారు. వేసవి కాలంలో హీట్ స్ట్రోక్‌తో పాటు విరోచనాలు (డయేరియా), పచ్చ కామెర్లు (జాండిస్) వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రోజుకు కనీసం 3--4 లీటర్ల నీరు తాగాలని, శుభ్రమైన, మరిగించిన లేదా ఫిల్టర్ చేసిన నీటిని మాత్రమే ఉపయోగించాలని, బయటకు వెళ్తే తలకు కప్పు (క్యాప్/టవల్) ఉపయోగించాలని వారు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12 నుండి 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలని, తేలికపాటి, పలుచని దుస్తులు ధరించాలని, కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలని, బయట ఆహారం, అస్వచ్ఛమైన ఆహారం తీసుకోవడం పూర్తిగా నివారించాలన్నారు. చేతులు తరచూ కడుక్కోవాలని, పరిశుభ్రత పాటించాలని, పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వాంతులు, విరోచనాలు, జ్వరం లేదా కళ్ళు/చర్మం పసుపు రంగులో మారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వేసవి కాలంలో చిన్న జాగ్రత్తలతోనే పెద్ద ఆరోగ్య సమస్యలను నివారించ వచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## సృష్టి ప్రారంభానికి

# నాంది ఉగాది

**కాల గమన సాధానికి తొలిమెట్టు**

**ప్రకృతిపులకింతలు,చిగురుటాకుల గమనం**

**పరాభనామ సంవత్సరానికి ఉగాది సవాల్ !**



**మణుగూరు మార్చి 18 (నినాదం):** తెలుగువారు అత్యంత ఉపనిషత్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ప్రధాన పండుగ ఉగాది. ఇది నూతన సంవత్సరానికి ఆరంభానికి సంకేతం, బ్రహ్మదేవుడు చైత్ర శుద్ధ పాడ్యమ రోజున సృష్టిని ప్రారంభించాడనీ వేద పండితులు ద్వారా సుస్పష్టంగా తెలు స్తుంది. సృష్టికి ముందు బ్రహ్మదేవుడు మత్స్య అవతారంలో విష్ణు వేదాలను రక్షించాడనిపురాణాలు, వేద పండితులు, ఉపనిషత్తుల ద్వారా తెలుస్తుంది. ఈ పండుగ దైవ సంబంధమైన పండుగ కాదని ఇది కేవలం కాలానికి సంబంధించిన పండగని తెలుస్తుంది. మనిషికున్న వనరులలో అన్నిటికంటే విలువైనది కాలం, అది వ్యర్థమైన, కరిగిపోయిన తిరిగిరాని గమనం. కాలం ద్వారా మనిషికి వచ్చిన వనరులు భంగపరిచేందుకు పరాభనామ సంవత్సరం స్వాగతం పలుకుతుంది. ఈ కాల గమనం గ్రహణ నక్షత్ర రుతువు, మాస వర్షాలు ఈరోజే నుంచే ప్రారంభం అవుతాయని నమ్మకం. విష్ణుమూర్తి మత్స్య అవతారాన్ని ధరించి సోమ కుడని రాక్షసుడిని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించిన రోజే ఉగాది.

**ఉగాది పచ్చడి:**

ఉగాది పండక్కి ప్రత్యేక ఆకర్షణ కలిగిందే ఉగాది పచ్చడి. ఇందులో ఉండేది తీపి (బెల్లం-సంతోషం) పులుపు(చింతపండు-మణిపుణ్యం) కారం (మిరప-సహనం) (ఉప్పు-రుచి) పొగరు (మామిడి-కొత్త ఆలోచనలు) చేదు (వేప పువ్వు-కష్టాలు) జీవితంలో తీపు చేదు కలిగినదే జీవితము. ఆ జీవితంలో ఆనందచాలను పూజించేదే ఉగాది. పదాలు వేరైనా అర్థం ఒకటే అనేదే చూపించేదే ఉగాది పచ్చడి. పదార్థాలు వేరైనా రుచులు ఒక్కటే. ఇందులో భావాలు వేరైనా భాష్యం ఒకటే. అన్నిటికి తీపి గుర్తులుగా ఉండేదే ఉగాది పండుగ.

చిరు మందహాసం మామిడి: వసంత రుతువు ప్రారంభంతో ప్రకృతిలో మొదలయ్యే వన సంరక్షణకు కొత్తగా చిగురించే మామిడి పూత ఆహ్లాదకమైన వాతావరణానికి నాంది పలుకుతుంది. వాతావరణంలో మార్పులు తెచ్చేదే వసంత రుతువుఅ ఋతువుకు మామిడికాయలకు దగ్గర సంబంధం ఉంటుంది. వసంత రుతువులో పక్షులు కిలకలా రాగాలు, కోయిల గొంతు వీణ స్వరాలు, వినిపించేదే ఉగాది. ఇక్కడి నుంచే మామిడి పువ్వుకి మాట వస్తుంది. కోయిల గొంతుకి కూత వస్తుంది. వేప చెట్టుకు పూత వస్తుంది, దీనికి తోడు పసిడి బెల్లం తోడై వస్తుంది. గుమ్మాలకు పచ్చని తోరణాలు తెచ్చింది మామిడి పూతలు. మామిడి తోనే జీవితం మమేకమై శోభాశితమైన చిరు మందహాసం కలిగిస్తుంది. దూరమైన జీవితాలు మమేకమై కొత్త జీవితాలు ప్రారంభిస్తారు.



**పరాభనామ సంవత్సరానికి ఉగాది సవాల్ :**

చైత్ర శుద్ధ పాడ్యమి రోజున సృష్టితో ప్రారంభమైన ఉగాది పండుగకు, పరాభ నామ సంవత్సరం సవాలు విసురు తుంది. మంచి చెడు తీపి గుర్తులతో మమే కమై ప్రారంభమైన ఉగాది పండుగకు పరాభనామసం వత్సరంలో ఎన్ని అడ్డంకులు, ఆక్షేపణలు, అవమానాలు తో స్వాగతం సుమాంజలి పలుకుతుంది అని వేద పండితుల మాట. ఈ సంవత్సరాన్ని లోతుగా విశ్లేషిస్తే ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధ తంత్రాలు, మానవులకు పరాభం. పాడిపంటలకు, భంగ పాటు కలిగిస్తుందని వేదపండితుల ద్వారా తెలుస్తుంది. ఈసంవత్సరములో ప్రకృతి సృష్టించే వికృత రూపాలు, అధిక వర్షాలు జన నష్టం పశు నష్టం కాలం కలిసి రాకపోవడం పరాభనామ సంవత్సరానికి నాంది.

# నూకల శంకర్‌బాబు ఉగాది పురస్కారం



**నాగర్ కర్నూల్ మార్చి 18 (నినాదం)** మారుమూల గిరిజన ప్రాంతమైన నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని ఏజెన్సీ గ్రామమైన ధారారం కు చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ నూకల శంకర్ బాబు ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. సొంత నిధులతో ఎటువంటి లాభాపేక్ష చేయకుండా సామాజిక సేవా దృక్పథంతో విశిష్ట సేవలు అందిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో పురస్కారాలు సత్కారాల అందుకుంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న డాక్టర్ నూకల శంకర్ బాబు సేవలను గుర్తించిన మయూరి ఆర్ట్స్ మంగళవారం రవీంద్ర భారతి లో జరిగిన కార్యక్రమంలో మెంబర్ ఆఫ్ ద ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ దువ్వాడ శ్రీనివాస్,బిగ్బాస్ ఫేమ్, కంచిపురం గోకుల్ సిల్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ దువ్వాడ మాధురి,ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ ది రికార్డ్ డాక్టర్ బింగి నరేందర్‌గౌడ్‌లు ఉగాది పురస్కారం నంది ప్రతిమ జ్ఞాపికను,ప్రశంస పత్రాన్ని అందజేసి సత్కరించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రాజమన్నమ్మ ఫౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలను గత 26ఏళ్లుగా వివిధ రూపాలలో క్షేత్రస్థాయిలో సామాజిక కార్యకర్త శంకర్ బాబు అందజేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి పలు సంస్థలు రాష్ట్ర జాతీయ స్థాయిలో పురస్కారాలు సత్కారాలను అందజేయడం విశేషం. 2017 లో తమిళనాడు రాష్ట్రంలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి శంకర్ బాబు డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. అదేవిధంగా 2023 జూలై నెలలో హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో స్థానం అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా రెండవసారి డాక్టరేట్ ను ఢిల్లీలోని హ్యూమన్ థేలాజికల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఉగాది పురస్కారాన్ని పొందడం తన బాధ్యతను మరింత పెంచిందని రాబోయే కాలంలో సేవా కార్యక్రమాలను విస్తృత పరిచి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. శంకర్ బాబుకు ఉగాది పురస్కారం అందుకోవడం పట్ల వాసవిక్లబ్ మండల అధ్యక్షుడు చెవ్వ బాలరాజు,మండల ఆర్య వైశ్యసంఘం నాయకులు హర్ష వ్యక్తం చేస్తూ అభినందించారు.

# రైతు వేదికలో రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లు పంపిణీ






**మధిర,మార్చి18 (నినాదం):** బుధవారం రోజున మధిర మండలంలోని మధిర రైతు వేదికలో వ్యవసాయ యాంత్రికరణ పథకం లో భాగంగా రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా మధిర ఏ డి ఏ విజయ చంద్ర మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రి కరణ పథకం దాదాపు పది సంవత్సరాలు తర్వాత ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది అన్నారు. దీనిలో భాగంగా చిన్న సన్నకారు రైతులకు 50% సబ్సిడీ మీద, పెద్ద రైతులకు 40% సబ్సిడీ మీద వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మదిన మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎప్పుడూ రైతుల్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తుందన్నారు. దానిలో భాగంగానే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మరల పునరుద్ధరిం చారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొనదని కుమార్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి, మధిర మండల వ్యవసాయ అధికారి , వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల పరిశీలన.



హుస్నాబాద్,మార్చి18( నినాదం):హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను రాజు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఇప్పటికే ఎల్లమ్మ చెరువు సుందరీకరణ కోసం 18 కోట్ల రూపాయలను కూడా కేటాయించడం జరిగింది. మరి కొద్ది రోజుల్లో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పూర్తికానుంది సుందరీకరణ పూర్తి అయితే హుస్నాబాద్ చుట్టుపక్కల ప్రజలకి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి రానుంది. ఎల్లమ్మ చెరువును పర్యవేక్షించిన వారిలో హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్ జుజు తిరుపతి ఐజు మహేష్-రాజు పృథ్వీరాజ్ ఉన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించాలని

# ఏరుగట్ల రైతులు నిరసన

**యాప్ పద్ధతిలో ఎరువులు వద్దు...**

**పాతపద్ధతిలోనే ఎరువులు అందించాలి:**

**సంఘీభావం ప్రకటించిన టిఆర్ఎస్**




**ఆర్మూర్, మార్చి 18 ( నినాదం):** రైతులకు సంబంధించిన సమస్యలను భూభారతిలో తమ భూమి వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, రైతు భరోసా, రైతు బీమా సకాలంలో అందించాలని, రైతులకు యూరియా తీసుకునేందుకు ఏర్పాటు చేసిన యాప్ పద్ధతిని రద్దుచేసి, పాత పద్ధతిలోనే యూరియా అందించాలంటూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ ఏర్గట్ల మండల కేంద్రంలో గల మండల రైతులు బైఠాయించి ధర్నా, నిరసన కార్యక్రమాన్ని బుధవారం రోజున నిర్వహించారు. రైతులు స్వచ్ఛందంగా చేపట్టిన మండల టిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు స్వచ్ఛం దంగా రైతుల నిరసన కార్యక్రమానికి రైతులతో పాటు బైఠాయించి రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ నిరసన తెలి యజేస్తూ రైతులకు మద్దతు తెలిపారు. రైతులకు సంబంధించిన పెండింగ్లో ఉన్న భూ సమస్యలను, భూ వివాదాలు తక్షణమే పరిష్కరించి, రైతులకు ప్రక టించిన సంక్షేమ పథకాలను సకాలంలో అందించాలని, రైతులు ఎరువులు తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ వల్ల, రైతులకు స్మార్ట్ ఫోన్ లు లేకపోవడం, ఉన్నప్పటికీ యాప్ లో ఎరువులు అందు కునేందుకు డౌన్లోడ్ చేసే అనుభవం లేకపోవడం, రైతులకు యాప్ ఎంతో ఇబ్బంది పరుస్తుందని, యాప్ లో డౌన్లోడ్ చేసినప్పటికీ రైతుకు ఒకే ఒక ఎరువు బస్తా అందిస్తున్నారని, యాప్ పద్ధతిని రద్దుచేసి, పాత పద్ధతిలోనే రైతులకు అవసరం మేరకు ఎరువులు అందించాలని, అధికారులు స్పం దించి స్వచ్ఛమైన హామీ ఇచ్చేవరకు , ఆందోళన విరమించేది లేని రైతులు భీష్మించుకొని బైఠాయించి నిరసన దీక్షలో కూర్చున్నారు. చేయి దాటిపో వడంతో స్థానిక మండల పోలీసులు ముందు జాగ్రత్తగా పర్యవేక్షించారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ల తోకూడిన పత్రాలను పట్టుకొని నిరసన మరింత ఉధృతంగా కొనసాగించారు. దీంతో ఎయిర్ గట్ల మండల తాసిల్దార్ మల్లయ్య, మండల పోలీసులు, వివిధ శాఖల అధికారులు సైతం వచ్చి రైతులకు సముదాయిం చారు. రైతుల సమస్యలను జిల్లా ఉన్నతాధికాలకు తీసుకెళ్లి పరిష్కరిస్తామని రెవెన్యూ పోలీస్ వివిధ శాఖల అధికారులు రైతులకుహామీ ఇచ్చారు. దీంతో రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ మల్లయ్య కు అందజేశారు. ఒకవేళ రైతుల సమస్యలు సకాలంలో పరిష్కారం కాకపోతే, జిల్లా రాష్ట్రవ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. మండల రైతులు, మండల టిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏరుగట్ల రైతులు నిరసన

**యాప్ పద్ధతిలో ఎరువులు వద్దు...పాతపద్ధతిలోనే ఎరువులు అందించాలి:**

**సంఘీభావం ప్రకటించిన టిఆర్ఎస్**



**ఆర్మూర్, మార్చి 18 ( నినాదం):** రైతులకు సంబంధించిన సమస్యలను భూభారతిలో తమ భూమి వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, రైతు భరోసా, రైతు బీమా సకాలంలో అందించాలని, రైతులకు యూరియా తీసుకునేందుకు ఏర్పాటు చేసిన యాప్ పద్ధతిని రద్దుచేసి, పాత పద్ధతిలోనే యూరియా అందించాలంటూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ ఏర్గట్ల మండల కేంద్రంలో గల మండల రైతులు బైఠాయించి ధర్నా, నిరసన కార్యక్రమాన్ని బుధవారం రోజున నిర్వహించారు. రైతులు స్వచ్ఛందంగా చేపట్టిన మండల టిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు స్వచ్ఛం దంగా రైతుల నిరసన కార్యక్రమానికి రైతులతో పాటు బైఠాయించి రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ నిరసన తెలి యజేస్తూ రైతులకు మద్దతు తెలిపారు. రైతులకు సంబంధించిన పెండింగ్లో ఉన్న భూ సమస్యలను, భూ వివాదాలు తక్షణమే పరిష్కరించి, రైతులకు ప్రక టించిన సంక్షేమ పథకాలను సకాలంలో అందించాలని, రైతులు ఎరువులు తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ వల్ల, రైతులకు స్మార్ట్ ఫోన్ లు లేకపోవడం, ఉన్నప్పటికీ యాప్ లో ఎరువులు అందు కునేందుకు డౌన్లోడ్ చేసే అనుభవం లేకపోవడం, రైతులకు యాప్ ఎంతో ఇబ్బంది పరుస్తుందని, యాప్ లో డౌన్లోడ్ చేసినప్పటికీ రైతుకు ఒకే ఒక ఎరువు బస్తా అందిస్తున్నారని, యాప్ పద్ధతిని రద్దుచేసి, పాత పద్ధతిలోనే రైతులకు అవసరం మేరకు ఎరువులు అందించాలని, అధికారులు స్పం దించి స్వచ్ఛమైన హామీ ఇచ్చేవరకు , ఆందోళన విరమించేది లేని రైతులు భీష్మించుకొని బైఠాయించి నిరసన దీక్షలో కూర్చున్నారు. చేయి దాటిపో వడంతో స్థానిక మండల పోలీసులు ముందు జాగ్రత్తగా పర్యవేక్షించారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ల తోకూడిన పత్రాలను పట్టుకొని నిరసన మరింత ఉధృతంగా కొనసాగించారు. దీంతో ఎయిర్ గట్ల మండల తాసిల్దార్ మల్లయ్య, మండల పోలీసులు, వివిధ శాఖల అధికారులు సైతం వచ్చి రైతులకు సముదాయిం చారు. రైతుల సమస్యలను జిల్లా ఉన్నతాధికాలకు తీసుకెళ్లి పరిష్కరిస్తామని రెవెన్యూ పోలీస్ వివిధ శాఖల అధికారులు రైతులకుహామీ ఇచ్చారు. దీంతో రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ మల్లయ్య కు అందజేశారు. ఒకవేళ రైతుల సమస్యలు సకాలంలో పరిష్కారం కాకపోతే, జిల్లా రాష్ట్రవ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. మండల రైతులు, మండల టిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటల సాగు వైపు మొగ్గు చూపాలి

## ఉద్యానవనశాఖ జిల్లా అధికారి సునిల్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

ఉద్యాన పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపితే అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యానవనశాఖ జిల్లా అధికారి సునిల్‌కుమార్ సూచించారు. బుధవారం మొగుళ్లపల్లి మండలం ఇసిపేట గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ఉద్యాన పంటల ప్రాముఖ్యత, తక్కువ నీటితో అధిక ఆదాయం పొందే విధానాలు, పంటల విభిన్నీకరణ అవసరం గురించి వివరించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ కూరగాయల పంటల సాగు విధానాలు, సరైన సమయంలో నాటే సమయం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి సమర్థ నిర్వహణపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అలాగే ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలు, స్థిరమైన మార్కెట్, అధిక దిగుబడి, దీర్ఘకాల ఆదాయం వంటి అంశాలను వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు, మినీ కిట్‌లు మరియు ప్లాంటేషన్ కార్యక్రమాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ యూరియా యాప్ వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, అలాగే ప్రకృతి వ్యవసాయంలో చేపట్టాల్సిన విధానాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమం అనంతరం జైన్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధి శ్యాంసుందర్ రైతులకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ నిర్వహణలో పాటించాల్సిన పద్ధతులు, నిర్వహణ జాగ్రత్తలు సమర్థవంతమైన వినియోగంపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇసిపేట చింతలపల్లి గ్రామాల సర్పంచులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు వాసు, ప్రీతం, అజయ్, రమేష్, జైన్, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధులు శ్యామ్ కుమార్, రజనీకాంత్, రైతులు పొన్నాల జనార్ధన్, పోలినేని రాజేశ్వరరావు, మోహన్ రెడ్డి, మహేందర్, సంబంధిత శాఖ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.








## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పథకాల అమలులో
# బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలి
## అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 18 ( నినాదం)**

ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళిక 2025–26 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం క్రిష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన వివిధ యూనిట్లకు బ్యాంకులు సమయానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఈ పథకాలను అమలు చేస్తున్నందున బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణ సదుపాయాలతో లబ్ధిదారులు స్వయం ఉపాధి ఏర్పరుచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బ్యాంకులు సహకరించాలని కోరారు.



## కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి
# పనులపై కలెక్టర్ పరిశీలన

**నాణ్యతతో, గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు**
**షెడ్యూల్డ్ కులాలకు 36 షాపింగ్ కాంప్లెక్స్‌ల కేటాయింపు**
**కల్వకుర్తిలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష,**
**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**కల్వకుర్తి, మార్చి 18 (నినాదం)**

కల్వకుర్తి పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను బుధవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, ఇప్పటివరకు పూర్తైన పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి రాజీ పడకుండా నిర్మాణాన్ని కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అవసరమైన వనరులు సమకూర్చి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ఈ ఆసుపత్రి కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో షెడ్యూల్డ్ కులాలకు కేటాయించాల్సిన 36 షాపింగ్ కాంప్లెక్స్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డ్రా విధానంలో షాపుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీ ఘటనలపై స్పష్టీకరణ

**నిర్మల్ ప్రతినిధి, మార్చి 18(నినాదం):**

బాసర ట్రిపుల్ ఐటి లో విద్యార్థులను పోలీసులు దూషించారని సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోలో వినిపిస్తున్న వాయిస్ పూర్తిగా అబద్ధం,ఆ వీడియో లో ఉన్న వాయిస్ మార్ఫింగ్ చేసి, తప్పుదారి పట్టించేలా కావాలని రూపొందించబడింది.కావున విద్యార్థులు, ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము.ఇలా మార్ఫ్ చేసిన వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం, వైరల్ చేయడం వంటి చర్యలు చట్టపరంగా శిక్షార్హం. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని నిర్మల్ జిల్లా పోలీసు శాఖ స్పష్టం చేసింది ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, అసత్య ప్రచారాలను ప్రోత్సహించవద్దని నిర్మల్ జిల్లా పోలీస్ విజ్ఞప్తి చేస్తోంది.

## నియోజకవర్గ అభివృద్ధికి అడ్డంకిగా మారిన కోర్టు కేసులపై..
# అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అనవసర న్యాయ వివాదాల వల్ల ఆలస్యమవుతున్న అభివృద్ధి పనులు**

**అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటే**

**ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు**

**మల్కాజిగిరి, మార్చి 18(నినాదం)**

మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు కోర్టు కేసుల కారణంగా నిలిచిపోతున్నాయని బుధవారం జరిగిన అసెంబ్లీ లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైన పలు అభివృద్ధి పనులు అనవసర న్యాయ వివాదాల వల్ల ఆలస్యం అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా (స్పీకర్) సభాధ్యక్షుల సమక్షంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, కోర్టు కేసులను సమగ్రంగా సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

**ఎమ్మెల్యే అసెంబ్లీ లో ప్రస్తావించిన ప్రధాన అంశాలు**

అల్వాల్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి భూమి, నిధులు మంజూరు అయినప్పటికీ, కోర్టులో దావా వేసి స్టే తీసుకోవడం వల్ల పనులు నిలిచిపోయాయన్నారు. ఉదాహరణకు మెతుకులకుంట చెరువు, బండ చెరువు వంటి చెరువుల అభివృద్ధికి నిధులు సిద్ధంగా ఉన్నా, సివరేజ్ ఛానల్ డైవర్షన్ పై కోర్టు కేసులు వేసి పనులు అడ్డుకుంటున్నారని, దీని వల్ల చెరువులు కలుషితమై గుర్రపు డెక్క, దోమల పెరుగుదల వల్ల ప్రజల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు. యూఎల్‌సీ (యు ఎల్ సి) భూముల విషయంలో కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మచ్చ బొల్లారం హిందూ స్మశానవాటికలో ఉన్న డంపింగ్ యార్డ్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మరియు హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటి అమలు జరగకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అడ్వకేట్ జనరల్ కి తక్షణ ఆదేశాలు జారీ చేసి, సంబంధిత జి.పి.లతో కలిసి అన్ని కోర్టు కేసులను సమీక్షించి వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటే ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుతాయని, నియోజకవర్గం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లారు.

# పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, మార్చి 18 (నినాదం)**

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్వి చారణ చేయగా మొత్తం 242 మంది విద్యార్థులకు గానూ బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 242 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థుల తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పరీక్షల నిర్వహణలో ఎటువంటి తప్పులు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, తహసీల్దార్ రమేష్ రెడ్డి, పరీక్ష కేంద్రం సిబ్బంది, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు





## సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో
# ఘనంగా 'కార్నివాల్ సెలబ్రేషన్–2026'

**సంగారెడ్డి బ్యూరో , మార్చి 18 ( నినాదం):**

సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో 'కార్నివాల్ సెలబ్రేషన్–2026' కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్నివాల్ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల యాజమాన్యం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగం హెచ్ఓడి వి. ఇందిరా ప్రియదర్శిని, జనరల్ సెక్షన్ హెచ్ఓడి డాక్టర్ ఎస్.ఎన్. పద్మావతి, ఈసీఈ ఇంచార్జ్ హెచ్ఓడి ఏ. విద్యాసాగర్, లైబ్రేరియన్ వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాస్ గౌడ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి
# పూర్తి సహకారం అందిస్తాం
## మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య



**వికారాబాద్, మార్చి 18(నినాదం):**

వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని వికారాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం అనన్య అన్నారు. ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన పాలకవర్గ ద్వితీయ కార్యవర్గ సమావేశం మార్కెట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ వికారాబాద్ రైతు బజార్ కు సంబంధించిన అభివృద్ధి విషయంపై అక్కడ నెలకొన్న సమస్యలపై చర్చించారు. మున్సిపల్ ఆధీనంలో ఉన్న రైతు బజార్ కు నిధులు కేటాయించి రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చూస్తానని మున్సిపల్ ఛైర్పర్సన్ హామీ ఇచ్చారు. అదేవిదంగా వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన అభివృద్ధికొరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ సహాయ సహకారంతో త్వరలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఏ ఎం సీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ను వైస్ చైర్మన్ నుఏ ఎం సీ పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ. సుధాకర్ రెడ్డి, ఏ ఎం సీ వైస్ చైర్మన్ మల్లేశం, వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిళ్లపాటి. రాజశేఖర్ రెడ్డి, ఏ ఎం సీ సెక్రటరీ ఫాసియొద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్తి నీటి పన్ను బకాయిల వసూళ్లలో వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం





**వనపర్తి ప్రతినిధి, మార్చి 18 (నినాదం)**

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి, నీటి పన్ను బకాయిల వసూళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ తో కలిసి జిల్లాలోని 5 మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన రోజు వారి లక్ష్యాలను అనుగుణంగా కలెక్షన్లను చేయాలని మున్సిపల్ అధికారులకు సిబ్బందికి సూచించారు. పన్ను బకాయి ఉన్న వారి జాబితాను వార్డుల వారీగా సిద్ధం చేయాలని, ఈ జాబితాను సంబంధిత వార్డు కౌన్సిలర్లకు కూడా అందజేయాలని ఆదేశించారు.పన్ను బకాయిలు ఉన్న వారి జాబితాలను తయారు చేసి వారికి డిజిటల్ పేమెంట్ చేయడం కోసం బార్ కోడ్ కలిగి ఉన్న నోటీసులను తయారుచేసి వారికి పోస్ట్ ద్వారా పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్ల ద్వారా ఇంటింటికి నోటీసులను చేరవేయాలని సూచించారు. నోటీసులను చేరవేసి పన్నులను రాబట్టడంలో కౌన్సిలర్ల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్నులకు సంబంధించి అత్యధిక మొత్తంలో పెండింగ్ ఉన్న బకాయిదారుల జాబితాను టాప్ 1000 లిస్ట్ సిద్ధం చేసి వారికి నోటీసులు పంపడంతో పాటు, బల్క్ ఎస్ఎంఎస్ లు కూడా పంపాలని ఆదేశించారు. ఈ అత్యధిక బకాయిలు ఉన్న వారిని మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు పర్యవేక్షణ చేసి బకాయిలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పన్నుల వసూళ్ల కోసం ప్రతి మూడు వార్డులకు ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పన్నుల వసూలు చేసి ఆదాయాన్ని రాబట్టాలన్నారు. తద్వారా ఆదాయాన్ని మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వినియోగించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. వనపర్తి మున్సిపాలిటీలో ఈ సంవత్సరం రూ.7 కోట్ల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాల్సిందిగా కలెక్టర్ సూచించారు. పన్ను చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు డిజిటల్ మోడ్ ను ప్రోత్సహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీలలో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పన్ను చెల్లింపుల కోసం ప్రత్యేకంగా 'రివిజన్ మేళా' నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మ్యుటేషన్లు, కొత్త ఇంటి నంబర్ల జారీ వంటి పనులు వేగంగా కొనసాగించాలని ఆదేశించారు. పన్ను వసూళ్ల పై ప్రతిరోజు పర్యవేక్షణ కొనసాగించి ప్రతిరోజు నివేదిక అందించవలసిందిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆదేశించారు. ఈ రాబోయే 13 రోజులు తప్పనిసరిగా ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా శ్రమించాలని సూచించారు.ఈ సమావేశంలో ఐదు మున్సిపాలిటీల కమిషనర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వైద్యురాలిగా వేషం...
# భర్తతో కలిసి మోసం
## బాగోతం బట్టబయలు.. ఇద్దరినీ అరెస్టుచేసిన పోలీసులు

**హైదరాబాద్,మార్చి 18(నినాదం):**




ఆసుపత్రుల్లో వైద్యురాలిగా నటిస్తూ రోగులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి బంగారు ఆభరణాలు దోచుకుంటున్న మహిళను, ఆమెకు సహకరించిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్, మార్కెట్ పోలీసులు సంయుక్తంగా ఈ చర్య చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన సమావేశంలో టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వివరాలను వెల్లడించారు.

**నిందితుల వివరాలు:**

గౌండ్ల శిరీష (25), ఎడులపల్లి సాయి కుమార్ గౌడ్ (30) దంపతులు. వీరు వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన వారు. శిరీష ఫార్మసీ డాక్టరేట్ చదువుతోందని తెలిపారు.

**ఇదీనేర విధానం:**

ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దంపతులు దొంగతనాలకు పాల్పడ్డారు. శిరీష వైద్యురాలిగా వేషధారణ చేసి ఆసుపత్రుల్లోకి ప్రవేశించి, ముఖ్యంగా వృద్ధ మహిళా రోగులను లక్ష్యంగా చేసుకునేది. తన వద్ద ఉన్న మత్తు ఇంజక్షన్‌ను ఇచ్చి వారు స్పృహ కోల్పోయిన తర్వాత బంగారు ఆభరణాలు అపహరించి పరారయ్యేది. మార్చి 11న సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి, చందానగర్‌లోని సిటిజన్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఇదే తరహా చోరీలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన సొమ్మును విలాసవంతమైన జీవనం, షాపింగ్ కోసం వినియోగించినట్లు వెల్లడించారు.

**స్వాధీనం చేసిన సొత్తు:**

సుమారు 11 తులాల బంగారు ఆభరణాలు, మారుతీ సుజుకీ బాలెనో కారు, రెండు మొబైల్ ఫోన్లు

**కేసులు నమోదు:**

మార్కెట్ పోలీస్ స్టేషన్, చందానగర్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, మార్కెట్ స్టేషన్ అధికారి రామచందర్ తదితరుల బృందం నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిందని డీసీపీ తెలిపారు.

# పరాభవనామ ఉగాది !

సంపాదకీయం

కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య`మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగిపోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర` పుష్య`మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం` 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చించి.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ల పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగు వారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళ నాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్లి పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పనులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.

# ప్రజాస్వామ్యమా? ప్రహసనమా?

## ఎన్నికల సంఘం నిష్పక్షపాతానికి, అగ్నిపరీక్ష!



భారతదేశం మరోసారి ఎన్నికల రణరంగంలోకి అడుగుపెట్టింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మరియు పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. అయితే, ఈ ఎన్నికల షెడ్యూల్ వెనుక ఉన్న తర్కం, అధికారుల బదిలీల పర్వం మరియు ఓటర్ల జాబితాలో జరిగిన భారీ కోతలు చూస్తుంటే.. భారత ఎన్నికల సంఘం (ECI) తన స్వయంప్రతిపత్తిని కాపాడుకోగలుగుతుందా లేదా అనే అనుమానాలు బలపడుతున్నాయి. 824 నియోజకవర్గాల్లో 17.4 కోట్ల మంది ఓటర్ల భవిష్యత్తును తేల్చే ఈ ప్రక్రియ, పారదర్శకతకు నిలువుటద్దం కావాల్సింది పోయి, వివాదాలకు నిలయంగా మారుతోంది.

### షెడ్యూల్ వెనుక 'రాజకీయ' వ్యూహాలేనా?

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్‌లో వింతైన అసమానతలు కనిపిస్తున్నాయి. ఒకవైపు కొన్ని రాష్ట్రాలకు నెల రోజులకు పైగా ప్రచార సమయం ఇచ్చి, మరికొన్ని రాష్ట్రాలను కేవలం మూడు వారాలకే పరిమితం చేయడం వెనుక అంతార్థమేమిటి? అస్సాం, కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రచార హోరు ముగియకముందే పోలింగ్ ముగిసిపోతుంటే, బెంగాల్‌లో మాత్రం విడతల వారీగా సుదీర్ఘంగా సాగడం వెనుక ఏ శక్తుల ప్రయోజనాలు దాగి ఉన్నాయనేది మింగుడుపడని అంశం.
మరీ ముఖ్యంగా, ఏప్రిల్ 9నే పోలింగ్ ముగిసినా, ఫలితాల కోసం మే 4 వరకు అంటే దాదాపు నెల రోజులకు పైగా వేచి చూడాల్సి రావడం అమానుషం. ఈ సుదీర్ఘ విరామం కేవలం పరిపాలనాపరమైన ఇబ్బంది మాత్రమే కాదు; ఇది గుర్రపు వ్యాపారాలకు (Horse Trading), తెరచాటు రాజకీయాలకు మరియు అధికార దుర్వినియోగానికి బాటలు వేసే ప్రమాదం ఉంది.

'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' అని గొంతు చించుకుంటున్న పాలకులు, కనీసం ఐదు ప్రాంతాలకు సక్రమంగా, వేగంగా ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ఉండటం హాస్యాస్పదం. వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచాల్సింది పోయి, కాలయాపన చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

### అధికారుల బదిలీలు.. సంస్కరణా? కక్ష సాధింపా?

పశ్చిమ బెంగాల్ మరియు తమిళనాడులో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే కీలక అధికారులపై బదిలీ వేటు వేయడం కలకలం రేపుతోంది. బెంగాల్‌లో సీఫ్ సెక్రటరీ, హోమ్ సెక్రటరీలను మార్చడం ద్వారా కేంద్రం తన పెత్తనాన్ని ప్రదర్శిస్తోందని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ బదిలీలు శాంతిభద్రతల పరిరక్షణ కోసమా లేక అధికార పక్షానికి అనుకూలంగా వ్యవస్థను మార్చుకోవడానికా అన్నది తేలాల్సి ఉంది.
సాధారణంగా ఎన్నికల వేళ అధికారులు పక్షపాతం చూపకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, నేరుగా రాష్ట్ర ప్రభుత్వాల అత్యున్నత యంత్రాంగాన్ని కదిలించడం ద్వారా ఎన్నికల సంఘం ఒక రకమైన 'భయోత్పాతాన్ని' సృష్టించే ప్రయత్నం చేస్తోందా అన్న సందేహాలు వస్తున్నాయి. ఎన్నికల సంఘం కేవలం ఒక రాజకీయ పక్షం యొక్క ఆయుధంగా కాకుండా, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా వ్యవహరించే ధైర్యం ప్రదర్శించాలి. బదిలీలు కేవలం కంటితుడుపు చర్యగా మిగిలిపోకూడదు.

### మానవత్వం మర్చిపోయిన 'నియమావళి'

ఎన్నికల కోడ్ (Model Code of Conduct) పేరుతో సామాన్యులను వేధించడం దారుణం. కోయంబత్తూరులో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుడి ప్రాణాలను కాపాడుకోవడానికి అత్యవసర చికిత్స కోసం రూ. 54,000 తీసుకువెళ్తుంటే, నిఘా బృందాలు దాన్ని పట్టుకుని వేధించడం వ్యవస్థలోని మొండితనానికి పరాకాష్ట. వేల కోట్ల రూపాయల నల్లధనం రాజకీయ పార్టీల అడ్డాలో చేరుతుంటే ఆపలేని వ్యవస్థ, సామాన్యుడి జేబులోని చిల్లర కోసం గాలం వేయడం సిగ్గుచేటు.
నియమావళి అనేది పారదర్శకత కోసం ఉండాలి కానీ, పౌరుల ప్రాణాలతో చెలగాటం ఆడటానికి కాదు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల అరాచకాలు సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాజకీయ పార్టీల విరాళాలు, భారీ ఎత్తున జరిగే ప్రకటనల ఖర్చుపై లేని నిఘా, ఒక మధ్యతరగతి మనిషి అవసరాలపై ఉండటం అత్యంత విచారకరం.

### ఓట్ల కోత...ప్రజాస్వామ్యంపై సర్జికల్ స్ట్రైక్!

అన్నింటికంటే భయంకరమైన అంశం 'ఓటర్ల జాబితా సవరణ' (Special Intensive Revision). తమిళనాడులో 74 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 64 లక్షలు, కేరళలో 9 లక్షల ఓట్లు తొలగించబడ్డాయి. ఈ అంకెలు వింటుంటే ఇవి కేవలం సాంకేతిక మార్పులు కావని, ఒక వర్గాన్ని లేదా ఒక భావజాలాన్ని అణచివేసే ప్రయత్నమని స్పష్టమవుతోంది. లక్షలాది మంది ఓటర్లను జాబితా నుండి తొలగించే ముందు వారికి సరైన సమాచారం ఇచ్చారా? లేక అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఏరిపారేసే ప్రక్రియలో భాగంగా ఇది జరిగిందా?
ఓటరు జాబితాలో తప్పులు ఉండటం సహజమే కానీ, ఇంత భారీ స్థాయిలో తొలగింపులు జరగడం ప్రజాస్వామ్య పునాదులనే కదిలిస్తోంది. ఈ ప్రశ్నలకు ఎన్నికల సంఘం జవాబు చెప్పి తీరాలి. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోతే, అది ప్రజాస్వామ్య ఓటమే అవుతుంది. ఈ 'శుద్ధీకరణ' ప్రక్రియ వెనుక ఉన్న పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

### విశ్వసనీయత కోల్పోతే మిగిలేది శూన్యం!

భారత ఎన్నికల సంఘం గర్వంగా "ప్రపంచం మనల్ని గమనిస్తోంది" అని చెబుతోంది. నిజమే, ప్రపంచం గమనిస్తోంది.. కానీ అది మన వైభవాన్ని కాదు, మన వ్యవస్థల పతనాన్ని! స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే, అది నియంతృత్వానికి నాంది అవుతుంది. రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర సంస్థలు తమ వెన్నెముకను నిటారుగా ఉంచుకోవాల్సిన సమయం ఇది.
ఈ ఎన్నికలు కేవలం గెలుపోటముల నిర్ణేతలే కాదు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంకా సజీవంగా ఉందో లేదో తేల్చే పరీక్షా సమయం. ఎన్నికల సంఘం తన నిష్పక్షపాతాన్ని నిరూపించుకోకపోతే, అది చరిత్రలో ఒక నల్లటి అధ్యాయంగా మిగిలిపోతుంది. ఓటరు తీర్పును గౌరవించే వాతావరణాన్ని కల్పించడమే ECI ముందున్న అసలైన కర్తవ్యం.

వెంకగారి భూమయ్య,
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## ఆర్టీ ఉద్యోగులకు సంస్థ షాక్

### ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

హైదరాబాద్ : ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎసఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ స్కీంమ్ ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవారు.

## ఉగాది రోజు ఆలయదర్శనం శుభం

వేములవాడ, : తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ రోజు ఏం చేస్తే.. ఏడాదంతా అదే జరుగుతుందనే ఒక భావన తెలుగు ప్రజలలో బలంగా ఉంది. గతేడాది కొంత కష్టంగా ఉంది. ఈ ఏడాది అయినా బాగుంటుందా అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు ఉగాది పర్వదినం వేళ.. ఇలా చేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగి.. ఆనందంగా ఉండొచ్చని అంటున్నారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతోంది.. గ్రహాల ప్రభావం ఏ రాశుల మీద ఎలా ఉందనేది పండితుల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పండగ రోజు.. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటే కుటుంబానికి శుభం కలుగుతుందని పండితులు చెబుతారు. ఆ రోజు పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, విజయాలు కలుగుతాయి. ఉగాది వేళ.. మీకు తోచిన వాటిని దానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. అన్నదానం, వస్త్రదానం ఇలా ఏదైనా చేయవచ్చు. ఉగాది రోజు కొత్త పనులు ప్రారంభిస్తే మంచి ఫలితాలు సంప్రాప్తిస్తాయి.

# కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

## సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవడం ఆనవాయితీ

ఉగాది పండుగ తెలుగు వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపే పండుగు. సంస్కతి.. సంప్రదాయాలకు.. ధర్మబద్ధ జీవన విధానాన్ని ప్రారంభించిన రోజు. ఇలాంటి ముఖ్యమైన రోజున మన జీవితాలను ఆధ్యాత్మిక పరంగా.. సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు చేయాలని పండితులు చెబుతున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి తిథి ఉదయం 6.53 గంగలకు ప్రారంభమవుతుంది. పాడ్యమి తిథి మార్చి 20 ఉదయం 04:54 గంటలకు ముగుస్తుంది. కావున పండితులు తెలిసిన వివరాల ప్రకారం ఉదయం సమయంలో పాడ్యమి తిథి ప్రాబల్యం ఉండటం వల్ల మార్చి 19నే ఉగాది పర్వదినంగా భావిస్తారు. ఉగాది రోజున ప్రాత: కాలంలో కాలకృత్యాలు తీర్చుకొని ఇంటిని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. గడపలను పసుపు.. కుంకుమతో అలంకరించాలి. పూజా మందిరంలో కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో కలశాన్ని ఏర్పాటు చేసుకొనే ఆచారం లేకపోతే అవసరం లేదు. కుల దైవాన్ని ఆవాహన చేసుకోవాలి. ముందుగా కొత్త సంవత్సరానికి సంబంధించిన సంకల్పాన్ని చెప్పుకొని.. గణపతి పూజ చేసుకొని.. విష్ణు మూర్తిని.. లక్ష్మీదేవిని.. పరమేశ్వరునికి పూజలు చేయాలి. షోడసోపచార పూజలు చేసి.. ధూపం.. దీపం.. హారతి తరువాత ఉగాది పచ్చడిని స్వామివారికి నివేదించి ప్రసాదంగా తీసుకోవాలి. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించడం ద్వారా జీవన తత్వాన్ని గుర్తుచేసుకుంటారు.తరువాత మహానివేద్యం సమర్పించాలి. ఈ విధంగా చేయడం ఎంతో కాలంగా వస్తున్న ఆచారం.. ఇంట్లో పూజ అనంతరం... దగ్గరలోని దేవాలయానికి వెళ్లాలి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినాలి. ఇది ఒక ప్రాచీన ఆచారమని పండితులు చెబుతున్నారు. పంచాంగం అనేది తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం వంటి 5 ముఖ్య అంశాలను వివరిస్తుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఖగోళ మార్పులు .. వాటి ప్రభావాలను తెలియజేస్తాయి. పంచాంగ శ్రవణం ద్వారా ఆ సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ స్థితిగతులు, సామాజిక శాంతి వంటి అంశాలపై సంక్షిప్త అవగాహన లభిస్తుంది. తరువాత బ్రాహ్మణులకు వస్త్రదానం .. దక్షిణ తాంబూలం ఇచ్చి.. వారి ఆశీర్వాదాలను తీసుకోవాలి. తెలుగు పంచాంగం ప్రకారం మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఇవే పునరావృతమవుతుంటాయి. ఈ ఏడాది 2026 లో మార్చి 19న కొత్త తెలుగు సంవత్సరం పరాభవనామ సంవత్సరం ప్రారంభమవతుంది. పరాభవం అంటే లోపాలను అధిగమించి ఉన్నత స్థితిని చేరుకొనే సమయాన్ని సూచిస్తుందని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మికత.. వినయం.. ఆత్మపరిశీలన.. సేవాగుణాన్ని వృద్ధి చేసే సందేశాన్ని ఇస్తుంది.



## ఉగాది పచ్చడి వైశిష్ట్యం

### కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం

తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహాఔషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్ధకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం` తీపి అనేది సంతోషానికి, ఉప్పు` జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు` చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు` పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు` కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహాఔషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్టనష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.



## పన్నులు చెల్లించి పుర అభివృద్ధికి పాటుపడండి

### చైర్‌పర్సన్ శ్రీరామ్ సంగీత




**దుబ్బాక, మార్చి 18: (నినాదం):** మున్సిపాలిటీలో పన్నులను సకాలంలో చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని దుబ్బాక పురపాలిక చైర్‌పర్సన్ శ్రీరామ్ సంగీత అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, నల్లా పన్నులను ఈ నెల 31వ తేదీలోపు తప్పనిసరిగా చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆమె అధ్యక్షతన బిల్ కలెక్టర్లు మరియు ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్చి 31 నాటికి 100% పన్నుల వసూలు లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వినియోగించేందుకు ప్రతి నల్లాకు ఆన్-ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాపూర్ నగర్ ఉషోదయ కాలనీ మార్కెట్లు పరిశీలించిన ఉప కమిషనర్

### తడి, పొడి చెత్తను వేరు చేయని దుకాణదారులకు జరిమానా



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 18 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్‌లో, 99 రోజుల ప్రజాపాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ప్రతిరోజూ షెడ్యూల్ ప్రకారం 13వ రోజు కార్యకలాపాలలో భాగంగా , షాపూర్ నగర్ మార్కెట్, ఉషోదయ కాలనీ కూరగాయల మార్కెట్లో కూరగాయలు, పండ్ల మార్కెట్లపై దృష్టి సారించారు. వారాంతపు సంతలలో మ్యాపింగ్‌తో కూడిన పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యర్థాలను సరిగ్గా వేరు చేయడానికి సులభంగా సేకరించడానికి దుకాణదారులకు రెండు బిన్‌లు (ట్విన్ బిన్‌లు) పెట్టుకోమని ఉప కమీషనర్ ఆదేశాలు జారిచేశారు. ఈ కార్యక్రమాన్ని గాజులరామారం సర్కిల్ ఉప కమీషనర్ పారిశుద్ధ్య సిబ్బంది సమక్షంలో నిర్వహించగా, పరిశుభ్రత చర్యలు సమర్థవంతంగా అమలు అయ్యేలా చూశారు. పరిశుభ్రత పాటించని దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. మొత్తం నాలుగు దుకాణాలు కు గాను 4100 జరిమానా విధించారు.

## రంజాన్ తోఫా పంపిణీ



**దుబ్బాక, మార్చి 18: (నినాదం):** దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చికోడ్ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం 'రంజాన్ తోఫా' పంపిణీ కార్యక్రమాన్ని అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిరుపేద ముస్లిం సోదర, సోదరీమణులకు అండగా 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 20 మంది వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తౌడా సత్యనారాయణ మాట్లాడుతూ, రంజాన్ పండుగ ఆత్మీయత, సహకారం, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సహాయం చేయడం తమ బాధ్యత అని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో సామాజిక సామరస్యం మరింత బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్, ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పోతారం గ్రామ సర్పంచ్ రేణుక మల్లేశం, అఖిల రాజ్ ఫౌండేషన్ సభ్యులు ఇనుప రవి, బిట్ల భాస్కర్, కంకణాల చంద్రం, వనం పోశయ్య, బండ నర్సింలు, ఇనుప రాజనర్సు, చంద్రం, పోశయ్యతో పాటు గ్రామస్తులు, ముస్లిం సమాజ నాయకులు కలిపి సుమారు 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# గీతంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవ వేడుకలు

### ముఖ్య అతిథిగా ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సిస్టా రామకృష్ణ, ఆత్మీయ అతిథిగా డాక్టర్ వంశీ మాడుగుల





**పటాన్చెరు, మార్చి 18 (నినాదం):** ప్రొఫెసర్ ఎం.ఎల్. ష్రాఫ్ 124వ జయంతిని పురస్కరించుకుని, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. 'ఔషధశాస్త్రంలో కృత్రిమ మేధస్సు: ఔషధ విద్య, పరిశోధనలలో ఒక నూతన ఒరవడి' ఇతివృత్తంగా దీనిని నిర్వహించారు. ఐఐసీటీ-హైదరాబాదు ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ సిస్టా రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, వర్ధమాన ఫార్మసిస్టులు తమ వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, సంప్రదాయ పరిధులకు అతీతంగా ఆలోచించాలని, అంతర్-విభాగ అభ్యసనాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఫార్మసీలోని విభిన్న రంగాలను అన్వేషించాలని, వినూత్నమైన, సమస్య-పరిష్కార దృక్పథాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులు, పరిశోధకులను ఆయన ప్రోత్సహించారు. సాయి లైఫ్ సైన్సెస్ లోని డి.ఎం.పి.కె. విభాగాధిపతి డాక్టర్ వంశీ మాడుగుల గౌరవ అతిథిగా హాజరై, ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఏఐ యొక్క పరివర్తనాత్మక పాత్రను వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. డ్రగ్ మెటబాలిజం, ఫార్మకోకైనటిక్స్ (డి.ఎం.పి.కె.) యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యత, సాంప్రదాయ ఔషధ అభివృద్ధిలో సవాళ్లు, ఏఐ-ఆధారిత విధానాలు సామర్థ్యాన్ని ఎలా పెంచగలవు, ముందస్తు ప్రమాద అంచనా ఎలా సాధ్యం, అంచనాత్మక, నివారణ వ్యూహాల వైపు దృష్టిని ఎలా మళ్లించగలవు అనే విషయాలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, పరిశ్రమ నిపుణులతో ఒక ప్యానెల్ చర్చను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న పరిశ్రమ నిపుణులు ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ప్రస్తుత పోకడలు, భవిష్యత్తు అవకాశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. తొలుత, ఈ కార్యక్రమ నిర్వాహకుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతించి, ఏఐ-ఆధారిత ఫార్మసీ విద్యలో ఉద్భవిస్తున్న అవకాశాలను చురుకుగా వినియోగించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియాసింగ్ సమన్వయం చేశారు. బి.ఫార్మా, ఎం.ఫార్మా, పీహెచ్.డీ. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## సామాజిక సేవకునికి ఉత్తమ ఉగాది పురస్కారం

### మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల వేడుకలు



**జవహర్‌నగర్, మార్చి 18 (నినాదం):** జవహర్‌నగర్‌లోని సామాజిక సేవకునికి 2026వ సంవత్సరానికి ఉత్తమ ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాద్ మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరపు ఉగాది వేడుకలు పురస్కారాలు, హైదరాబాద్ కలలకు నిలయంగా మారిన రవీంద్రభారతిలో మంగళవారం అంగరంగ వైభవంగా మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కు చెందిన సామాజిక సేవకుడు, సీనియర్ జర్నలిస్ట్ అరుణ్ కుమార్ త్యాగి కి ప్రత్యేక గౌరవం దక్కడం ముదాభావం. ప్రముఖ సామాజిక సేవకుడు అరుణ్ కుమార్ త్యాగిని కళా సాంస్కృతిక రంగాలకు విశేష సేవలు అందిస్తున్న మయూరి ఆర్ట్స్ సభ్యులు అరుణ్ కుమార్ త్యాగికి ప్రత్యేకంగా సన్మానించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మయూరి ఆర్ట్స్ సభ్యులు మాట్లాడుతూ సమాజ సేవ యువతకు మార్గదర్శకత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ విశేష గుర్తింపు పొందుతున్న వారికి ఇచ్చే ఉగాది పురస్కారాల బహుమతి అరుణ్ కుమార్ త్యాగ కి ఇవ్వడం ముదా భావమన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ త్యాగి మాట్లాడుతూ ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను పెంచిందని సమాజానికి ఇంకా సేవ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతిభను ప్రోత్సహిస్తూ సమాజానికి సేవ చేసే వ్యక్తులను గౌరవించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు, జర్నలిస్టులు, మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధంతో మానవ మనుగడ ప్రమాదకరం

### అమెరికా దురాక్రమణను ప్రపంచ దేశాలు ఖండించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల విజ్ఞప్తి



**జవహర్‌నగర్, మార్చి 18 (నినాదం):** పచ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంతో మానవ మనుగడ ప్రమాదంలో పడిందని 19 రోజులుగా ఇరాన్ పై సాగిస్తున్న ఆధిపత్య దురాక్రమణ ఆగడాలను వెంటనే అమెరికా విరమించుకోవాలని ప్రజాసంఘాల నాయకులు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో పచ్చిమాశియా దేశాల్లో జరుగుతున్న యుద్ధాన్ని నిరసిస్తూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత సన్నిహిత మిత్రుడు ట్రంప్ అని చెప్పుకునే భారత ప్రధాని ఇరాన్ పై యుద్ధ నివారణకు పెద్దన్న పాత్రను పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పెరిక సునీత, వద్దేపల్లి శివకుమార్, ఎస్కే మీరా, టీ. కలేశా, శివ బాబు, దుర్గాప్రసాద్, సాయి కిరణ్, మహమ్మద్ మతిన్, ఇస్మాయిల్, ఇమ్రాన్, ఖాజా పాల్గొన్నారు.

## ధర్మాజీపేట రైతులకు నీటి వసతి కల్పించాలి



**దుబ్బాక మార్చి 18 (నినాదం):** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు ఇందిరమ్మ ప్రభుత్వం పంపిణీ చేసిన వ్యవసాయ భూములకు నీటి వసతి కల్పించాలని 9వ వార్డు కౌన్సిలర్ వనం రమేష్ కోరారు. ఈ మేరకు ఆయన సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లేఖను సమర్పించారు. ధర్మాజీపేటలో సర్వే నెంబర్ 77 మరియు 86లో అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వ కాలంలో ఎస్సీ వర్గాలకు భూములు పంపిణీ చేయబడినప్పటికీ, ప్రస్తుతం ఆ భూముల్లో సాగు చేయడానికి అవసరమైన నీటి సౌకర్యం లేదని తెలిపారు. మల్లన్న సాగర్ లింకు కాలువల ద్వారా ఎటెన్ కుంట, తిమ్మకుంట, చింతకుంట, గుండ్లకుంట, చౌదర్పల్లి చెరువుల్లో నీటిని నింపితే, ఆ చెరువుల ఆధారంగా పై సర్వే నెంబర్లలో ఉన్న భూములకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని వివరించారు. అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మల్లన్న సాగర్ లింకు కాలువల ద్వారా చెరువులను నింపి, ధర్మాజీపేట రైతులకు సాగునీటి సదుపాయం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ హామీలను వెంటనే అమలుచేయాలి



**వికారాబాద్, మార్చి 18(నినాదం ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయాలంటూ బుధవారం బీజేపీ నాయకులు జిల్లా పరిధిలోని నవాబుపేట మండల తహసీల్దార్ కార్యలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మెరకు ఈ నిరసన తెలిపామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలు అమలు చేయకపోగా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏలాంటి అభివృధి చేయకపోగా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు కూడా ప్రజా క్షేత్రంలో ఉండకుండా విలాసవంతమైన రాజకీయ జీవితానికి అలవాటు పడ్డారని మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు ప్రధాన రహదారి ఎన్నో రోజుల నుంచి ఇబ్బందికరంగా ఉందని కేవలం కమిషన్ల కోసమే రోడ్డు పనులు ప్రారంభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో మూసి ప్రక్షాళన పేరుతో కేవలం పేద ప్రజల ఇండ్లను కూల్చి వారిని రోడ్డున పడేసి కేవలం పేద ప్రజలను మాత్రమే ఇబ్బంది పెడుతున్నారని, బఫర్ జోన్ లో కట్టిన ఓవైసీ కాలేజ్ ని ఇప్పటివరకు ఎందుకు హైడ్రా ముట్టుకోలేని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలం అధ్యక్షులు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి జగన్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సిములు, విజయ్, శివ బూత్ అధ్యక్షులు మాణిక్యం, దుర్గయ్య, నర్సింహా చారి, శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# గీతంలో ముగిసిన పౌర రక్షణ వాలంటీర్ల శిక్షణ





### విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు గుర్తింపు కార్డు, ప్రశంసాపత్రాల ప్రదానం

**పటాన్చెరు, మార్చి 18 (నినాదం):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన పౌర రక్షణ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల సహకారంతో, తెలంగాణ అగ్నిమాపక విపత్తు స్పందన అత్యవసర ఒ పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైమానిక దాడులు, రసాయన సంఘటనలు, అణు ధార్మికత పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల వంటి అత్యవసర పరిస్థితులలో సమర్థవంతంగా స్పందించడానికి అవసరమైన నైపుణ్యాలను ఈ ఆచరణాత్మక శిక్షణ ద్వారా ఇందులో పాల్గొన్న విద్యార్థులకు అందించారు. సహాయక చర్యలు, అగ్నిమాపక పద్ధతులు, ప్రథమ చికిత్స, జన సమూహ నిర్వహణ, సహాయక సామగ్రి పంపిణీలో అనుసరించాల్సిన వ్యూహాలపై వాలంటీర్లు ఆచరణాత్మక శిక్షణ పొందారు. సంక్షోభ పరిస్థితులలో సువ్యవస్థితమైన, సకాలంలో స్పందించేలా తీర్చిదిద్దడంతో పాటు పోలీసు శాఖ, అగ్నిమాపక సేవలు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) వంటి కీలక అత్యవసర ప్రతిస్పందన సంస్థలతో సమన్వయం చేసుకునేందుకు కూడా విద్యార్థి స్వచ్ఛంద సేవలకు మార్గదర్శనం చేశారు. తక్షణ సహాయం అందించగల శిక్షణ పొందిన కమ్యూనిటీ వాలంటీర్ల బలమైన నెట్ వర్కును నిర్మించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని, తద్వారా అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడటానికి, నష్టాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని శిక్షణను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన గీతం విద్యార్థి స్వచ్ఛంద సేవకులకు, జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా విలువైన గుర్తింపు కార్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ విశిష్టమైన, ప్రభావవంతమైన శిక్షణ కార్యక్రమంలో భాగమైనందుకు గీతం విద్యార్థులు ఒకింత గర్వాన్ని, సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 12న గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.నాగేశ్వరరావు, పటాన్ చెరు అగ్నిమాపక శాఖాధికారి కె.వి. నాగేంద్ర, ఇతర అధికారుల, సిబ్బంది సమక్షంలో లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే.

# నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు

### కోర్టు పనుల పురోగతి పెండింగ్ బిల్లుల చెల్లింపులపై మంత్రి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి

**మల్కాజిగిరి, మార్చి 18 (నినాదం):** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరిలో నిర్మాణంలో ఉన్న (14ఒ2) కోర్టుల భవన సముదాయం (పిఓసిఎస్ఓ ఫ్యామిలీ కోర్టులతో సహా) పనుల పురోగతి పెండింగ్ బిల్లుల చెల్లింపులపై రాష్ట్ర రోడ్లు ఒ భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువస్తూ, బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.90 కోట్ల అంచనా వ్యయంతో అమలవుతుండగా, ప్రస్తుతం దాదాపు 28.5% పనులు పూర్తయ్యాయన్నారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ. 2.80 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉండటంతో పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని, కార్మికులు, సరఫరాదారులకు చెల్లింపులు చేయలేక కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి, కోర్టు భవన సముదాయం పనులను వేగవంతం చేయాలని మంత్రి ని కోరడం జరిగిందన్నారు. మల్కాజిగిరి ప్రజలకు న్యాయ సేవలు సులభంగా అందేలా ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, మంత్రి ఈ విషయంపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.



# పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

### మున్సిపాల్టీల పరిధిలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, మార్చి 18, (నినాదం):** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని.. ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన 75 కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్లు, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్, జలమండలి, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. అమీన్పూర్ సర్కిల్ పరిధిలో గల బీరంగూడ, అమీన్పూర్, రామచంద్రపురం, భారతి నగర్, బొల్లారం వార్డుల పరిధిలో గల ప్రతి కాలనీకి పారిశుధ్య సిబ్బందిని కేటాయించి.. ప్రతిరోజు పర్యవేక్షించాలని కోరారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సైతం తెలుసుకోవాలని సూచించారు. నూతన కాలనీలకు సరిపడి సిబ్బంది లేకపోతే నూతన సిబ్బందిని నియమించాలని సూచించారు. అతి త్వరలో సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పారిశుద్ధ్య వాహనాలను సైతం కేటాయించ బోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేకంగా 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని.. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అమీన్పూర్ సర్కిల్ పరిధిలో మంచినీటి కొరత లేకుండా చూడాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు అజయ్ రెడ్డి, తిరుపతి, వెంకట కిషన్, వెంకటరామయ్య, దశరథ్, డి ఈ వెంకటరమణ, జలమండలి డీజీఎం శివ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతిఒక్కరూ సీఎం సహాయనిధిని

## సద్వినియోగం చేసుకోవాలి



**కుత్బుల్లాపూర్, మార్చి 18 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 126 – జగద్గిరిగుట్ట డివిజన్ కు చెందిన నలుగురు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు డివిజన్ కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకుల చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్సకోసం ఎదురుచూస్తున్న ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు మెట్ల శ్రీను, సయ్యద్ సాజిద్, ముంతాజ్ అలీ, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

### మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



**మల్కాజిగిరి, మార్చి 18( నినాదం):** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ లోని న్యూ వెంకటేశ్వర కాలనీ లో గల శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్ లో బుధవారం సైన్స్ ఫెర్ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని సైన్స్ ఫైర్ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు ఏర్పాటు చేసిన సైన్స్ ఫైర్ లో పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా సునీత రాము యాదవ్ మాట్లాడుతూ లో పిల్లలు ఉన్నత స్థాయి లో ఉండాలని, సైన్స్ ఫైర్ వల్ల పిల్లలకు మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, శాంతినికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్ చారి, బైరు అనిల్ కుమార్, సూర్య ప్రకాష్, మల్లేష్, రాజా, అశోక్, సరిత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరిని ఓటరు జాబితాలో చేర్పించాలి

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**నల్లగొండ ప్రతినిధి, మార్చి 18 (నినాదం):** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు కావాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తన చాంబర్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్ ను జారీచేయనున్నదని, ఇందులో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ వారిగా ఏజెంట్లను నియమించాలని కోరారు. 2002 లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, 25 సంవత్సరాల తర్వాత తిరిగి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ ఐ ఆర్ లో మ్యాపింగ్ కానీ వారిని తప్పనిసరిగా మ్యాపింగ్ చేసుకోమని చెప్పాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ భాగంగా ఓటర్ గా నమోదయ్యేందుకు ఉన్న అర్హతలు తెలియజేస్తూ భారత పౌరుడై ఉండి ,18 సంవత్సరాలు పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గంలో నివాసి అయి ఉండాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సవ్యంగా నిర్వహించేందుకుగాను అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈఆర్వోలు, మండల స్థాయిలో ఏఈఆర్ఓ, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు ఉంటారని వెల్లడించారు. దీన్ని దృష్టి లో ఉంచుకొని అన్ని రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. ఏజెంట్లు పారదర్శకంగా ఉండాలని, వీరి ద్వారా ఓటర్లకు ముఖ్యంగా మ్యాపింగ్ కాని వారికి మ్యాపింగ్ చేసేలా అవగాహన కల్పించాలని, ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ గురించి అందరికి తెలియజేయాలని ఎన్యుమరేషన్ కానీ వారు తప్పనిసరిగా ఎన్యుమరే షన్ చేయించుకునేలా చూడాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లు మ్యాపింగ్ కాని వారందరూ మ్యాపింగ్ అయ్యేలా అవగాహన కల్పించాలని, ఎన్యుమరేషన్ విషయంలో బిఎల్ఎ లను నియమించడంతో పాటు, బిఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు సహకరించాలని, ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందరు ఓటర్లకు ఇప్పించేలా చూడాల్సిన బాధ్యత బిఎల్ఎ, బిఎల్ ఓ లపై ఉందని ఆయన చెప్పారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బి ఎల్ ఓ లు గృహాలను సందర్శించడం జరుగుతుందని ఇంకా మ్యాపింగ్ కానీ వారు మ్యాపింగ్ చేయించుకోవాలని, ఎన్యుమరేషన్ కై ఎన్నికల సంఘం సూచించిన 12 డాక్యుమెంట్లలో ఏదో ఒకటి ఆధారంగా చూపించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ఇంచార్జీ అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ముంతాజ్ అలీ, బిజెపి నుండి లింగస్వామి, టిడిపి నుండి రఫీ, ఏఏపి నుండి అద్దంకి రవి, సిపిఐఎం నుండి నర్సిరెడ్డి, బి ఎస్ పి నుండి యాదగిరి, బిఆర్ఎస్ నుండి పిచ్చయ్య, ఎన్సీపీ నుండి రఫీ, ఎం ఐ ఎం నుండి బషీరుద్దీన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



## ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలి

**పరాభవ సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ములుగు కలెక్టర్**



**ములుగు ప్రతినిధి, మార్చి 18 (నినాదం):** పరాభవ నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు వృద్ధి చెంది రైతుల కళ్ళలో ఆనంద భాష్పాలు వెల్లువిరవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలుపుతూ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలకు ఉగాది పండుగ ఎంతో గొప్పదైన పండుగని పండుగ సందర్భంగా షడ్రుచులు స్వీకరించడం, దైవంతో భక్తి చాటడం చెప్పుకోదగ్గ విశేషమని అన్నారు. ప్రతి ఒక్కరి భవిష్యత్తులో వివరించే పంచాంగం ఇదే రోజు విలువరించడం ఈ పండుగ ప్రత్యేకత అని ఆయన కొనియాడారు. కొత్త సంవత్సరంలో జిల్లా అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని ఆయన పేర్కొన్నారు.

## అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ



**కోదాడ,మార్చి 18(నినాదం):** తెలంగాణా శబరిమల అనంతగిరి శ్రీఅయ్యప్ప సన్నిధిలో 2026 సంక్రాంతి నుండి ప్రతి బుధవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం పదవవారం సైతం నిర్వహించబడింది. అమీనాబాద్ వాస్తవ్యులు తీపిరిశెట్టి శ్రీరాములు దంపతులు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సుమారు 45 మంది భక్తులు స్వామి దర్శనం పొందుతూ అన్నప్రసాదం స్వీకరించారు. ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయణ, సలహాదారులు జగిని ప్రసాద్, మహాలక్ష్మయ్య, కొండపల్లి వేణు గోపాల్ రావు, దండు రమేష్, పొనుగోటి కనకయ్య, సైదయ్య, గరిడేపల్లి ఉపేందర్ మరియు ఇతర భక్తులు పాల్గొన్నారు.

## బొప్పన రత్నగిరిరావుకు మాజీ ఎమ్మెల్యే నివాళులు



**మిర్యాలగూడ మార్చి 18( నినాదం) :** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన 95 సంవత్సరాల వయస్సు గల బొప్పన రత్నగిరి రావు అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు వారి వెంట సిడి రవికుమార్, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మట్టపల్లి సైదులు, వెలిశెట్టి రామకృష్ణ, చిమట మదార్, పునాటి లక్ష్మీనారాయణ, మహేష్, మాలోతు రవీందర్, తిరందాసు విష్ణు, భీమ్లా నాయక్, తుమ్మల ఫణి కుమార్, శ్రీను, దుర్గ, కోటేశ్వర రావు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను తగ్గించవచ్చు

**గ్రామ అభివృద్ధికి ప్రముఖ పాత్ర పోషిస్తున్న సర్పంచ్‌లు**

**ఎస్పీ డా. ఐపీఎస్ శబరీష్**



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 18(నినాదం):** మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ,రోడ్డు ప్రమాదాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన మరియు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు మహబూబాబాద్ టౌన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గ్రామ సర్పంచులు,వార్డ్ సభ్యులు,కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు మరియు వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.అలాగే సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించేందుకు, గతంలో సీసీ కెమెరాల సహాయంతో ఛేదించిన కేసుల ఫుటేజీలను ప్రదర్శించారు.గ్రామాల్లో మరియు పట్టణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని,ప్రతి గ్రామంలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.అలాగే, గ్రామ అభివృద్ధి మరియు శాంతి భద్రతల పరిరక్షణలో ఆదర్శంగా నిలిచిన ఆదర్శ గ్రామ సర్పంచ్‌లకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ సన్మానం నిర్వహించి ప్రశంసించారు.మరిపెడ మండలం గాలివారి గూడెం గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ నా రెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి ని ఎస్పీ ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ డా.శబరీష్ మాట్లాడుతూ సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో గ్రామ సర్పంచులు,ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారు.యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయించడం ద్వారా నేరాలను అరికట్టవచ్చు. గ్రామాభివృద్ధి,యువత భవిష్యత్తు కోసం మీరు ముందుండి పనిచేయాలి.పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం కట్టుబడి ఉంది.ప్రజల సహకారం ఉంటేనే సమాజంలో శాంతి, భద్రతలు మెరుగుపడతాయన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధుల్లో చైతన్యం పెంచి, గ్రామ స్థాయిలో భద్రతా చర్యలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు గంద్రతి మోహన్, తిరుపతి రావు,కృష్ణ కిషోర్,సీఐలు,ఎస్.ఐలు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి జీవసేంద్రియ పద్ధతిలో సాగు చేయండి

**మండల వ్యవసాయ ఇంచార్జి అధికారి అరవింద్**



**అమరచింత, మార్చి 18, (నినాదం):** రసాయన ఎరువులు తగ్గించి జీవ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని ఆత్మకూరు మండలం వ్యవసాయ ఇన్చార్జి అధికారి ఇన్చార్జి అధికారి అరవింద్ రైతులకు సూచించారు. మంగళవారం ఆరేపల్లి గ్రామ రైతు వేదికలో జరిగిన సమావేశంలో రైతులకు వరిలో రసాయనిక ఎరువులు పురుగుమందులు శిలీంద్ర నాశీనుల వాడకం తగ్గించి జీవ సేంద్రియ పద్ధతిలో భూమికి,వాతావరణానికి, మనుషుల ఆరోగ్యానికి హాని జరగకుండా ఉండేటువంటి జీవసంబంధ ఎరువులు, ( అజటోబాక్టర్( యూరియా), పాస్ఫేట్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా ( పి ఎస్ పి - డి ఏ పి ), పొటాష్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా( కె ఎస్ పి - ఎం ఓ పి ) పురుగుమందులు కషాయాలను రైతులకు వివరించి వాటి యొక్క ప్రొడక్ట్స్ ను రైతులకు చూపించడం జరిగింది . దీని ఉద్దేశించి వచ్చే వాన కాలంలో రైతులు కనీసం వారు తినడానికి అయినా సరే కొంత సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ రసాయనిక ఎరువుల వాడకాన్ని వరిలో తగ్గించాలని జాతీయ సహజ వ్యవసాయ మిషన్ లో భాగంగా తెలియజేయడం జరిగింది.

స్థానిక గ్రామ సర్పంచ్,,వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్,గ్రామ రైతులు సమావేశంలో పాల్గొన్నారు.

## నానో ఎరువుల ద్వారా అధిక లాభాలు

**ఇన్చార్జి ఎడిఎ సైదా నాయక్**



**మిర్యాలగూడ మార్చి 18 (నినాదం):** నానో యూరియా, డిఏపి ద్వారా భూసారం పెరుగుతుందని మిర్యాలగూడ ఇన్చార్జి ఏ డి ఏ సైదా నాయక్ అన్నారు. మండలం ఐలాపురం గ్రామపంచాయతీలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు నానో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. నానో యూరియా వాడకం ద్వారా భూసారం మెరుగుపడి, పంటలకు అధిక దిగుబడులు లభిస్తాయని, రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా పంటలకు రోగనిరోధక శక్తి పెరిగి, చీడపీడల ప్రభావం తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర రసాయన మందులతో కలిసి నానో యూరియాను స్ప్రే చేయవచ్చని కూడా సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్య నాయక్, ఏఈవోలు రమేష్, మాజీ సర్పంచ్ సైదా నాయక్ గారు, శ్రీ సంద్రాల వెంకన్న, నాయక్, లింగయ్య, శంకర్ నాయక్ రైతులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**చింతపల్లి, మార్చి 18 (నినాదం) :** మండలంలోని హోమంతాలపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండల ధనలక్ష్మి,రవిల కూతురు తన్మయ్ శ్రీ ప్రథమ పుట్టిన రోజు వేడుకలను మండల కేంద్రంలోని సాయి సుమంగళి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని చిన్నారి తన్మయ్ శ్రీని ఆశీర్వదించారు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, మాజీ రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు,సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్, ఉప సర్పంచ్ మంజుల అల్వాల్, మాజీ సర్పంచ్ బత్తిని మధుసూదన్ రెడ్డి, బత్తిని ఇంద్రారెడ్డి, అర్ధం యాదయ్య, రాజు నాయక్, మోతిరాం నాయక్, జైపాల్ నాయక్ పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 18(నినాదం):** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలంలోని లచ్య తండా గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్ ఆధ్వరంలో డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు నూతన కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీని అభివృద్ధి చేస్తామన్నారు.అలాగే ఎన్ఆర్ఈజీఎస్ 5 లక్షల నిధులతో సిసి రోడ్ నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి నడవడానికి కష్టంగా ఉంటుంది. కావున సిసి రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వారితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సుగంధ రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించండి

**స్పైసెస్ బోర్డు నూతన డిప్యూటీ డైరెక్టర్ రామన్నను కలిసిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి**



**ములుగు ప్రతినిధి, మార్చి 18 (నినాదం):** సుగంధ పంటలు సాగు చేస్తున్న రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా ఆదుకునేందుకు అవసరమైన పథకాల అమలుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జాతీయ సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ స్పైసెస్ బోర్డు వరంగల్ రీజనల్ నూతన డిప్యూటీ డైరెక్టర్ రామన్న ను జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కోరారు బుధవారం వరంగల్ స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కేరళ రాష్ట్రం నుండి బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రామన్న కు సాంబశివరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసి ఆయనతో భేటీ అయ్యారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుగంధ మరియు వాణిజ్య పంటగా మిర్చి పెద్ద ఎత్తున సాగు అవుతుందని మిర్చి రైతుల కోసం స్పైసెస్ బోర్డు నుండి వచ్చే ఆర్థిక సంవత్సరంలో విరివిగా వివిధ పథకాల కింద నిధులు మంజూరు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు ఆర్థిక చేయుతతో పాటు సాంకేతిక సాగు పద్ధతులను ప్రోత్సహించేలా నిధులు మంజూరు చేయాలని తెలిపారు అదేవిధంగా పసుపులో నూతన వంగడాల సాగు ను ప్రోత్సహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి పసుపు పరిశోధన స్థానం నుండి నూతన పసుపు వంగడాల విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు స్పైసెస్ బోర్డ్ తో కలిసి పని చేయుటకు తమ ఎఫ్ పి ఓ సిద్ధంగా ఉందని ఇందుకోసం ములుగు జిల్లా ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించాలని సాంబశివరెడ్డి కోరారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పైసెస్ బోర్డు రీజనల్ సెమినార్ నిర్వహించాలని సూచించారు ఈ సందర్భంగా నూతన స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రామన్న మాట్లాడుతూ వివిధ పథకాల నిధులు కోసం బోర్డు ప్రధాన కార్యాలయానికి కార్యాచరణ పంపిస్తామని నిధులు మంజూరు కాగానే అమలు చేస్తామన్నారు అదేవిధంగా త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ పర్యటిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు స్థానిక అధికారులు సాంబశివరెడ్డి వ్యక్తిగత సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయకట్టుకు చేరని సాగునీరు

**కోదాడలో రైతుల ఆగ్రహం**

**కాలువలోకి దిగి నిరసన తెలిపిన రైతులు**

**వెంటనే నీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్**



**కోదాడ, మార్చి 19(నినాదం):** సాగునీరు అందక చివరి ఆయకట్టు భూముల్లో వరిపంటలు ఎండిపోతుండటంతో కోదాడ మండల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కాపుగల్లు, నల్లబండగూడెం, ద్వారకుంట, రెడ్లకుంట గ్రామాల రైతులు బుధవారం ఆర్కే మేజర్ కాలువలోకి దిగి నిరసన తెలిపారు.ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి వంతుల వారీగా నీరు విడుదల చేస్తున్నప్పటికీ, ఆ నీరు మధ్యలోనే ఆగిపోతూ చివరి భూములకు చేరడం లేదని రైతులు తెలిపారు. దీంతో వేల ఎకరాల్లో సాగుచేసిన వరి పంట ఎండిపోతూ రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో అప్పులపాలైన రైతులు, ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయంలో ఇలా ఎండిపోవడం తమను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు.“మొన్నటి వరకు యూరియా కోసం క్యూలలో నిలబడి కష్టపడి పంటలను పెంచాం.. ఇప్పుడు నీరు లేక పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి” అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడులు తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో కుటుంబాల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపించారు. కాలువలలో మురుగు, మట్టి పేరుకుపోవడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిరంతరాయంగా సాగునీరు విడుదల చేయడంతో పాటు కాలువలను శుభ్రపరచి చివరి భూములకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జాల శ్రీనివాస్, జాల వెంకన్న, గోపి, తిరపయ్య, ముత్తయ్య, మహేష్, కార్తీక్, సోమయ్య, నగేష్, రాంబాబు, శంకర్, నాగేశ్వరరావు, వేణు, బిక్షం తదితర రైతులు పాల్గొన్నారు.

## పురాతన విగ్రహాలను పరిశీలించిన పురావస్తు శాఖ



**మహాదేవపూర్ మార్చి 18 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ సమీపం తో పాటు గ్రామంలోని పురాతన విగ్రహాలను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి డిప్యూటీ సూపరిండెంట్ కోటయ్య పరిశీలించారు. గ్రామంలో పలుచోట్ల ఉన్న పురాతన విగ్రహాలను శుభ్రం చేసి వాటన్నింటిని ఆలయ ఆవరణలో పొందు పరుచుటకు నిర్ణయించారు. పురావస్తు శాఖ అధికారుల వెంట శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ మహేష్ తదితరులు ఉన్నారు.

## నవోదయ ఫలితాల్లో.. గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు



**మహాదేవపూర్, మార్చి 18, (నినాదం):** నవోదయ పరీక్ష ఫలితాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు సీట్లు సాధించారు . మంగళవారం విడుదలైన ఫలితాల్లో గ్రీన్ వుడ్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న చిలుముల చైత్ర ,చల్ల అబిక్, అజ్మీర మాన్విత ,అత్యంత ప్రతిభ కనబరిచి నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి కి సీటు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ప్రత్యేక శిక్షణ విద్యార్థుల యొక్క ఘటోర శ్రమ వల్ల విజయం సాధ్యమైందని కొనియాడారు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించే నవోదయ సంస్థలకు పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాల తో పాటు తల్లిదండ్రులకు గర్వకారణమని అన్నారు ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం శాలువాలతో సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్ వైస్ ప్రిన్సిపల్ జన్ను రవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మూలమల్ల రంగారెడ్డి



**అమరచింత, మార్చి 18, (నినాదం):** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు మూలమల్ల గ్రామ సర్పంచ్ రంగారెడ్డి. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పాండురంగ స్వామి కాలనీలో గత కొన్ని రోజుల నుండి అక్కడి ప్రజలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచు రంగారెడ్డి, గ్రామ పెద్దలు దేశాయి పద్మజా రెడ్డి లు కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం బుధవారం రోజు కాలనీవాసులకు ఇంటింటికి త్రాగునీటి కోసం పైపులైను వేసి నల్లాను ఏర్పాటు చేసి కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గ్రామ సర్పంచ్, గ్రామ కార్యాలయ సిబ్బందికి గ్రామ ప్రజలకు పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అశోక్, వార్డ్ మెంబర్లు అశోక్, శివ, మునిస్వామి, గ్రామ పెద్దలు కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలపై అవగాహన




**మహాదేవపూర్ మార్చి 18, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి లో ఉద్యానవన పంటలపై ఉద్యానవనం శాఖ అధికారి మణి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహదేవపూర్ డివిజన్ పరిధిలోని మల్హర్, మహా ముత్తారం, కాటారం, పలిమెల, మహాదేవపూర్ మండలాల్లో సుమారు 250 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతుందని ఆమె తెలిపారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉద్యానవన ప్రణాళిక క్రింద రైతులకు 50% సబ్సిడీ అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ఒక్క హెక్టార్కు 24 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని ఉద్యానవన సమగ్ర అభివృద్ధి పథకం కింద పండ్లతోటలు,కూరగాయలు, తేనెటీగల పెంపకం, ఆయిల్ పంటల సాగు,ఉద్యాన యాంత్రికరణ వంటి అంశాలపై కూడా ఆమె రైతులకు తెలిపారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏర్పుల సరిత ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి తో పాటు ఉద్యానవన శాఖ అధికారులు రైతులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## ప్రస్తుత సమాజంలో మహిళలదే కీలకపాత్ర: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్








**నిర్మల్ ప్రతినిధి, మార్చి 18(నినాదం):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహిళల పాత్రను కొనియాడుతూ, వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అబలలు కాదని, సబలలుగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. విద్య ద్వారా మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్న కలెక్టర్, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, పని ప్రదేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న విద్యార్థులు, ఉద్యోగులు తమ విజయగాథలను ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఖజానా శాఖ అధికారి సరోజ, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.




# నవోదయ ఫలితాల్లో చైతన్య విశ్వభారతి స్కూల్ విద్యార్థి

**పెద్దపల్లి రూరల్,మార్చి18(నినాదం):**
నవోదయ విద్యాలయ సమితి 2026 విద్యా సం,రానికి గాను నిర్వహించిన ఫలితాలను మంగళవారం విడుదల చేసింది.ఈ ఫలితాల్లో జిల్లా స్థాయిలో హన్మంతుని పేట్ చెందిన విద్యార్థి గన్నబోయిన శ్రీ వాత్సవ 10 వ ర్యాంకు సాధించి సత్తా చాటిండు.అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని చైతన్య విద్యా భారతి హై స్కూల్ పాఠశాల కరస్పాండెంట్ తిరునహరి లక్ష్మణస్వామి,ప్రిన్సిపల్ జ్యోతి మరియు ఉపాధ్యాయులు అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు అభిలాషించారు.




# శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరు విజయం సాధించాలి

## ముందస్తుగా తెలుగు సంవత్సరం వేడుకలు.. కాకతీయ పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి

**మంథని మార్చి 18 (నినాదం)**
తెలుగు సంవత్సరమైనా ఉగాది వేడుకలు కాకతీయ పాఠశాలలో ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మంథని పట్టణం కాకతీయ పాఠశాలలో శ్రీ పరాభవ నామ సంవత్సర వేడుకలను అత్యంత వైభవంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ముందస్తుగా ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి ప్రతి ఒక్కరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఉగాది పచ్చడి, భక్ష్యాలు అందరికీ పంపిణీ చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా ఏర్పాటుచేసిన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థుల ఉద్దేశించి ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగు సంవత్సరాల పైట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. సాంప్రదాయ బద్ధంగా ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులందరూ పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు. యుగం ప్రారంభమైన సందర్భంగా జరుపుకునే అత్యంత గొప్ప పండుగ ఉగాది అని పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత సాంకేతిక రోజుల్లో తెలుగు సంవత్సరాలు మర్చిపోవడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి వాటి యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఉగాది వేడుకలలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలు ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## కేంద్ర నోడల్ అధికారి అమిత్ కటోచ్






**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి ,మార్చి 18(నినాదం)**
ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్, ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల కేంద్ర నోడల్ అధికారి అమిత్ కటోచ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె.హరిత అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 18 ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు మ్యాథ్స్, సైన్స్ సర్కిల్స్‌ను విస్తరించాలని సూచించారు. విద్యార్థులకు క్షేత్ర స్థాయి పరిజ్ఞానం అందేలా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలన్నారు. అలాగే ఎకో క్లబ్‌లు, నృత్యం, సంగీతం, అటల్ టింకరింగ్ ల్యాబ్, వృత్తి విద్య, కంప్యూటర్ విద్య వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ, జిల్లాలోని ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మౌలిక వసతుల అభివృద్ధి, అదనపు గదుల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థుల నమోదు పెంపు కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త సతీష్, ఫైనాన్స్ అకౌంట్స్ అధికారి జాడి దేవాజి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# మంచిర్యాలలో పనులు పూర్తయిన తర్వాత టెండర్లు

**మంచిర్యాల, మార్చి 18(నినాదం):**
తెలంగాణ రాష్ట్రంలో టెండర్ లేకుండా కాంట్రాక్టర్ పనులు చేయడం మంచిర్యాలలోనే జరుగుతుందని శంకుస్థాపనలు అయిన తర్వాత టెండర్లు పిలుస్తున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. బుధవారం మంచిర్యాలలో రోడ్డు విస్తరణలో కోల్పోయిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాస టాకీస్, మార్కెట్ రోడ్ మరియు రైల్వే స్టేషన్ రోడ్ లో యజమానులకు ఎలాంటి నోటీస్ లేకుండా మున్సిపల్ అధికారులు అభివృద్ధి పేరుతో కూల్చివేతలు జరపడాన్ని ఆయన ఖండించారు. నగర అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, అధికారులు పండుగల సమయంలో కూల్చివేతలు జరిపి ప్రజలను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని అన్నారు. యజమానులకు ముందస్తుగా నోటీసులు ఇచ్చి కూల్చివేయాలని మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్, మేయర్ ను డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

**మంథని టౌన్ మార్చి 18 (నినాదం)**



మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ, తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పరిషయ్య మాట్లాడుతూ తెలుగువారి నెలలు చైత్రమాసంతో మొదలై ఫాల్గుణ మాసంతో ముగుస్తుందని తెలుగువారికి మొదటి పండుగ ఉగాదితో ప్రారంభమవుతుందని ఇదే యుగానికి ఆరంభంగా ఉందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. అందరూ ఆనందంగా ఈ పండుగ జరుపుకోవాలని ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు మానస మాట్లాడుతూ ఉగాది పండుగ విశిష్టతలైన ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం గురించి, ఈ పరాభవ నామ సంవత్సర విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి, భక్షాలు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, రజిత, దుర్గం కృష్ణ, శేఖర్, శ్రీధర్, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారి పైన చర్యలు తీసుకోవాలి

**మంథని మార్చి 18 (నినాదం)**



మహిళ కౌన్సిలర్ ను అవమానించి ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారి పైన చర్యలు తీసుకోవాలని మంథని మున్సిపల్ 6 వార్డు కౌన్సిలర్ పోతర బోయిన శ్రీలత క్రాంతి కుమార్ బుధవారం లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఇటీవలే మేము ప్రాతినిధ్యం వహించే బోయిని పేట వార్డులో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కనీసం సమాచారం అందించకుండా ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమం నిర్వహించారని, ప్రోటోకాల్ ఉల్లంఘించి బీసీ మహిళ ప్రతినిధిని అవమానపరిచారని పేర్కొన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘించకుండా చూసుకునే ఆదేశాలు మున్సిపల్ సంబంధిత అధికారులకు ఇవ్వాలని ఆమె కోరారు.




# ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ జానపద కళా జాతర

**నిర్మల్ ప్రతినిధి, మార్చి 18(నినాదం):**
నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం ఉగాది తెలంగాణ జానపద కళా జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మల్ ప్రెస్ క్లబ్లో పొన్నం నారాయణ గౌడ్, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ కత్తి కిరణ్ తదితరు మాట్లాడుతూ 19 సంవత్సరాలుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు నిర్మల్ పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించి ఈ ఉత్సవాలకు జబర్దస్త్ కళాకారులు సుధాకర్ వినోదిని ప్రవీణ్ హాజరవుతారు అన్నారు, ఉగాది పండుగ ప్రాధాన్యత, ఉగాది పచ్చడి పంచాంగ శ్రవణం సాంస్కృతిక కార్యక్రమాలు గోపూజ యజ్ఞం నిర్వహిస్తామన్నారు, తెలుగు సంవత్సరాది ఉగాది పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పొడెలి చిన్నయ్య ప్రధాన కార్యదర్శి గురుమూర్తి కమిటీ సభ్యులు వెన్నెల చిన్నయ్య నరసయ్య తదితరులు ఉన్నారు.

# పదవ తరగతి పరీక్ష ప్రశాంతం

## జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

### పదవ తరగతి సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 99.9% మంది విద్యార్థులు హాజరు

**పెద్దపల్లి మార్చి,మార్చి-18(నినాదం):**
జిల్లాలో పదవ తరగతి రెండ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు జరిగాయని,ఈ పరీక్షకు 7489 మంది హాజరు కావాల్సి ఉండగా,7480 మంది హాజరు కాగా,9 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని,99.9 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని,ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అందుబాటులో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు

## భయాందోళనతో గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేసుకోవద్దు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష



**పెద్దపల్లి,మార్చి18(నినాదం):**
జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని,జిల్లా కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మన జిల్లాలో గత రెండు రోజులలో సరాసరి కంటే 40% అధికంగా గ్యాస్ సిలిండర్ బుకింగ్ జరిగాయని,ప్రజలు భయాందోళనలతో గ్యాస్ సిలిండర్ బుక్ చేయవద్దని కలెక్టర్ కోరారు. 3 నుంచి 4 రోజుల వ్యవధిలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని,గ్యాస్ సిలిండర్ స్టాక్ అంశాన్ని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని,కలెక్టర్ పేర్కొన్నారు. ఎల్.పి.జి సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 29 సిలిండర్స్ సీజ్ చేయడం జరిగిందని ఉన్నారు.జిల్లాలో 15 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందని,వాటి డెలివరీలో ఏవైనా ఆటంకాలు ఎదురైతే జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబరు 08728 224045ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. గృహ సంబంధిత అవసరాలకు సరఫరా చేసే ఎల్.పి.జి సిలిండర్లను ప్రతి రోజు ఆర్.డి.ఓ.,లు తహసీల్దార్లు,సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఎల్.పి.జి సిలిండర్ల సరఫరా పై వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని గృహ వినియోగానికి, ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు, వృద్ధాశ్రమాలకు,ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి రూరల్,మార్చి18(నినాదం):**
అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పట్టణంలోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాయ్స్ జరుగుతున్న 10 వ తరగతి పరీక్షా కేంద్రాన్ని,ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాలలో నిర్మిస్తున్న ఈత కొలను స్విమ్మింగ్ పూల్ పనులను, వ్యవసాయ మార్కెట్ లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు.ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ హర్ష మాట్లాడుతూ,10 వ తరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఐ.టి.ఐ,లో నూతనంగా నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను త్వరగా పూర్తి చేసి 3 నెలలో అందుబాటులో తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు కాంప్లెక్స్ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో ఏ.ఈ.నరేష్ , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు




## సాంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్న విద్యార్థులు

## షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడి పంపిణీ

## ఉగాది ప్రాముఖ్యతపై అవగాహన

**మంథని టౌన్ మార్చి 18 (నినాదం)**
మంథని పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి .జాఫర్ మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని తెలుగు సాంప్రదాయం ప్రకారం తెలుగు సంవత్సరముగా కొత్త సంవత్సరంగా ఉగాది పండగ పర్వదినాన్ని తెలుగు ప్రజలు చాలా సాంప్రదాయ పద్ధతిలో మొదటి పండుగగా భావించి అంగరంగ వైభవంగా జరుపుకుంటారని ఉగాది పండుగ యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉగాది వైభవం పంచాంగం, పచ్చడి, సంస్కృతి సంప్రదాయాల గురించి పరాభవ నామ సంవత్సర విశిష్టత గురించి వివరించి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులందరూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొని ఉగాది పచ్చడి సేవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి పైడితల్లి



**సుల్తానాబాద్, మార్చి 18 (నినాదం):**
ప్రభుత్వం రైతులకు పెట్టుబడి కింద అందించే ఆ ర్థిక సహాయం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పైడి తల్లి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టి న రైతు భరోసా పథకం (యాసంగి 2025-26) కిం ద అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం నేరుగా వా రి బ్యాంకు ఖాతా లో జమచేయబడుతుందన్నా రు. ఫిబ్రవరి 28 వరకు కొత్త పట్టు పాస్‌బుక్ పొం దిన రైతులు సైతం ఈ పథకానికి అర్హులని రైతు లు తమ వివరాలను వెంటనే రైతువేదికలలో లే దా మండల వ్యవసాయ అధికారి కార్యాలయం లో దరఖాస్తు చేసుకోవాలనిసూచించారు.కావలసిన పత్రాలు రైతు భరోసా దరఖాస్తు ఫారం,పాస్ బుక్ కాపీ, ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్‌బుక్, మొబై ల్ నంబర్ అందించాలని తెలిపారు.గతంలో రైతు భరోసా డబ్బులు ఖాతాలో జమఅవుతున్న వారు ఎటువంటి దరఖాస్తులు ఇవ్వవలసినఅవసరంలే దన్నారు.

# నారాయణపూర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు





**సుల్తానాబాద్, మార్చి 18 (నినాదం):**
సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామం లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహిం చారు. నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అం బేద్కర్ కాలనీకి చెందిన మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు స మర్పించారు.ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల నడు మ భక్తులుఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నా రు. సంప్రదాయ వేషధారణలో మహిళలు తలపై అలంకరించిన బోనాలు మోసుకుంటూ ఆలయా నికి చేరుకోవడం ఆకట్టుకుంది. ఊరంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి, భక్తి పరవశంతో కళకళలాడింది.ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మహా మంగళ హారతులు అందించారు. అనంతరం భక్తులకు తీ ర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొలవాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలు, మహి ళాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అలుపెరగని కృషి...

## పోరాట పంథా, జాతికోసం విధేయత

# హక్కుల రక్షణకై ఆదివాసీ

### గూడాల గుండెల్లో సుస్థిరం లక్ష్మణరావు దొర

### మహనీయుల ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు

### ములుగు గడ్డపై సజాతి జెండాను ఎగరేసిన నేత

### తుడుం దెబ్బ జిల్లా సారధిగా మరోసారి ఏకగ్రీవం

**ములుగు ప్రతినిధి, మార్చి 18 (నినాదం):** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన నల్లెబోయిన లక్ష్మణరావు దొర ఆదివాసీ హక్కుల పరిరక్షణలో నిరంతరం కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. నల్లెబోయిన లక్ష్మి నర్సయ్య – సమ్మక్క దంపతుల పెద్ద కుమారుడైనా ఆయన విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఉద్యమాల బాట పట్టారు. గత రెండు దశాబ్దాలుగా గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిరసనలు, ధర్నాలు, వినతిపత్రాలు, అధికారులతో చర్చలు వంటి మార్గాల్లో తన గళాన్ని వినిపిస్తున్నారు. గూడాల్లోని సమస్యలను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడుతున్నారు.

**తుడుం దెబ్బ ఉద్యమంలో కీలక పాత్ర**

ములుగు జిల్లా తుడుం దెబ్బ ఉద్యమంలో లక్ష్మణరావు దొర కీలక పాత్ర పోషిస్తున్నారు. కొమురం భీమ్, బిర్సా ముండా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా గిరిజన సమస్యలను ప్రస్తావిస్తూ గుర్తింపు పొందారు.

**విద్యార్థి దశ నుంచే నాయకత్వ నైజం**

తాడ్వాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నప్పుడే విద్యార్థి సమస్యలపై స్పందించి పోరాటాలకు నాయకత్వం వహించారు. పాఠశాల సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. చదువుతో పాటు ఉద్యమాలను సమన్వయం చేస్తూ విద్యను కొనసాగించారు. తాడ్వాయి గురుకులంలో పదవ తరగతి, మంగపేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం నాగార్జున విశ్వవిద్యాలయం నుండి సోషియాలజీలో ఎంఏ, తిరువూరులో బీఈడీ పూర్తి చేశారు.



**గ్రామం నుంచి రాష్ట్ర స్థాయికి ....**

2000లో మల్లూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఆదివాసీ గ్రామాల్లో చైతన్యం కల్పించారు. యువతను ఉద్యమాల వైపు దారితీస్తూ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ 2013లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించింది. అప్పటి నుంచి నిరంతరం జాతి సేవలో కొనసాగుతున్నారు.

**అందరికీ ఆప్తుడైన నాయకుడు**

లక్ష్మణరావు దొర ములుగు జిల్లాలో ప్రజలతో పాటు అధికారులకు, ప్రజాప్రతినిధులకు కూడా సుపరిచితుడు. ఉద్యమాల పరంగా స్ఫూర్తిదాయక నాయకుడిగా గుర్తింపు పొందారు.

**మరోసారి జిల్లా అధ్యక్షుడిగా..**

తుడుం దెబ్బ సంస్థలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తన సేవలను కొనసాగించిన లక్ష్మణరావు దొరను మళ్లీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేయడం పట్ల జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.









# మట్టిలో కలిసిపోతున్న చాళుక్యుల కాలం నాటి చరిత్ర

### చరిత్రని భావితరాలకు అందించాలి, చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్

**హుస్నాబాద్, మార్చి 18 (నినాదం)** హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామం చరిత్రకు పెట్టింది పేరు ఇక్కడ ఎన్నో యుగాలనాటి అద్భుతమైనటువంటి కట్టడాలు ఆ కాలంలో ఏర్పాటు చేసినటువంటి విగ్రహాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ చరిత్రకు కొంత మంది తూట్లు పొడుస్తున్నారు. చాళుక్యుల కాలం నాటి కొన్ని విగ్రహాలని స్వయంభు రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి ఎదురుగా ఉన్న రేణుక ఎల్లమ్మ వాగులో పడి వేశారు. ఈ విగ్రహాలకు ఎంతో చరిత్ర ఉంది అంతకుముందు ఈ విగ్రహాలు గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయం ముందు ఉండేవి అక్కడికి వచ్చే భక్తులు చాలామంది ఈ విగ్రహాలను ఆసక్తిగా చూసేవారు. కానీ ఇప్పుడు ఈ విగ్రహాలను వాగులో పడి వేయడంతో చరిత్రకారుడు శ్రీనివాస్ కొన్ని రోజుల క్రితం వీటిని ఇక్కడ గుర్తించడం జరిగింది. సంబంధిత గ్రామస్తులకు ఆలయ అర్చకులకి తెలిపినా కూడా ఎలాంటి స్పందన లేదని ఆయన అన్నారు. చరిత్రను ప్రతిబింబించే ఈ విగ్రహాలను ఇలా పడి వేయడం సరికాదని అన్నారు. అక్కడ పడి వేసిన విగ్రహాలని నిలబెట్టి వెళ్లడం జరిగింది అని కానీ కొంతమంది ఆ విగ్రహాలపై మట్టిని పోసారని చరిత్ర ఎంతో గొప్పదని చరిత్రను కాపాడుకుంటే భావితరాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఇప్పటికైనా గ్రామస్తులు అధికారులు స్పందించి ఆ విగ్రహాలను ఎక్కడో ఒకచోట పెడితే చరిత్రను నిలుపుకున్న వాళ్ళం అవుతామని. ఇక్కడ పడ వేసిన విగ్రహాలలో ఉన్న వర్ధమాన మహావీరుని జయంతి మార్చి 31వ తేదీన ఉంది. మహావీరుని జీవితం మహావీరుడి బోధనలు నేటి ప్రపంచాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. మహాత్మాగాంధీకి సైతం ఆయన బోధనలే స్ఫూర్తిగా నిలిచాయని తెలిపారు.





## నవోదయ రిజల్ట్‌లో సత్తా చాటిన

# శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ

**జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించిన సాయి శ్రీయాంక్**

**కోదాడ, మార్చి 18 (నినాదం):** కోదాడ పట్టణంలోని శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ విద్యార్థులు జిల్లా ర్యాంకులు సాధించి సత్తా చాటార ని అకాడమీ నిర్వాహకులు విజయ్ తెలిపారు. బుధవారం నవోదయ లో మంచి ర్యాంక్ లు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను శాలువా, బొకేలతో సన్మానించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ ఇదేవిధంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నవోదయ రిజల్ట్ లో జిల్లా ఫస్ట్ ర్యాంక్ ఎం సాయి శ్రీయాంక్ , జిల్లా థర్డ్ ర్యాంక్ టి విశ్వదీప్,జిల్లా ఫోర్త్ ర్యాంక్ భూక్యా రుచిత , సిహెచ్ సహస్ర జిల్లా 48 వ ర్యాంక్ సాధించారు. జిల్లా ర్యాంకులు సాధించడంతో విద్యార్థులను అభినందించారు. అంచలంచెలుగా శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ లో ర్యాంకులు రావడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.తమ పిల్లలకు జిల్లా ర్యాంకులు రావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లలిత, విద్యార్థులు ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు






# ఉస్తాద్‌పై ఉత్కంఠ

స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ ప్రస్తుతం,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అభిమానుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పలేం. ఇటీవల విడుదలైన ట్రైలర్ కూడా ప్రేక్షకులకు ఓ మోస్తరుగా అనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ట్రైలర్ లోని కొన్ని డైలాగులపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోల్స్ కూడా వచ్చాయి. 'ఈ సినిమాను కాపాడేది పవనే' అన్న కామెంట్లు కూడా వినిపించాయి. అయితే ఈ విమర్శలను పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్దగా పట్టించుకోవడం లేదు. సోషల్ మీడియాలో హరీష్ శంకర్‌పై వచ్చే నెగటివ్ కామెంట్లకు వారు గట్టిగా కౌంటర్ ఇస్తూ దర్శకుడికి మద్దతుగా నిలుస్తున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్' ఒక రీమేక్ అనే ప్రచారం మొదలైన సమయంలో పవన్ ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి కనిపించింది. అప్పట్లో హరీష్ శంకర్‌పై విమర్శలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారినట్లు కనిపిస్తోంది.



# షోలేను వందరెట్లు మించిన మూవీ

**'ధురంధర్ 2' పై ఆర్జీవి రివ్యూ**



'ధురంధర్ 2' కోసం ఎదురుచూస్తోన్న ప్రేక్షకుల్లో జోష్ పెంచుతూ.. వారి అంచనాలను రెట్టింపు చేసేలా పోస్ట్ పెట్టారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. 'ధురంధర్' మొదటిభాగం వచ్చినప్పటినుంచి వరుస పోస్ట్‌లతో చిత్ర బృందంపై ప్రశంసలు కురిపిస్తోన్న ఆయన.. తాజాగా దీని రెండో భాగం చూసినట్లు వెల్లడించారు. 'రాత్రి 'ధురంధర్ 2' చూశాను. ఆడియో, విజువల్ అన్నీ కట్టిపడేసేలా ఉన్నాయి. ఇది కచ్చితంగా 'షోలే' సినిమా కంటే వంద రెట్లు అద్భుతంగా ఉంది. బాక్సాఫీస్ వసూళ్లు, సామాజిక ప్రభావం, సినిమాటిక గ్రామర్ పరంగా ఈ చిత్రం ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తుంది ఇది ఒక సినిమా మాత్రమే కాదు.. అంతుకుమించి. ఒక కొత్త సినిమాటిక అనుభూతినిస్తుంది. భారతీయ సినీ పరిశ్రమను ప్రపంచస్థాయికి తీసుకెళ్తుంది అని అన్నారు. దర్శకుడు ఆదిత్యధర్ ప్రతిభను ప్రశంచారు.

# నా అనుమతి తీసుకోలేదు

### వివాదాస్పద పాటపై నోరా ఫతేహి

తాను నటించిన 'సర్కే చునార్ తేరి సర్కే' పాట వివాదంపై నటి నోరా ఫతేహి స్పందించారు. ఈ సాంగ్ హిందీ వెర్షన్‌లో చోటుచేసుకున్న మార్పుల గురించి తనకు తెలియదన్నారు. ఈ విషయంలో తన అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.

"కన్నడ వెర్షన్ సాంగ్ షూటింగ్ మూడేళ్ల క్రితం జరిగింది. పెద్ద సినిమా కావడం, పైగా సంజయ్‌దత్‌తో కలిసి నటించే అవకాశం రావడంతో అంగీకరించా. హిందీ పాట 'ఖల్ నాయక్ హూ మే'ను రీమేక్ చేస్తున్నారనుకున్నా. అప్పుడు నాకు కన్నడ అర్థం కాదు కాబట్టి వారు చెప్పిన దానిపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ సమయంలో ట్రాన్స్‌లేట్ చేసినప్పుడు అసభ్యకరంగా ఉన్నట్లు అనిపించలేదు. " అని అన్నారు

NINADAM CINEMA

## మార్చి 27న

# పెద్ది టీజర్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పెద్ది'. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. అయితే, ఇంకా షుటింగ్ మాత్రం కంప్లీట్ కాలేదు. రిలీజ్‌కు మరో ఆరు వారాల సమయం మాత్రమే ఉంది. మరి సినిమా అనుకున్న సమయానికి విడుదల అవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో చిత్రబృందం షుటింగ్ పనుల్లో వేగాన్ని పెంచింది. తాజా సమాచారం ప్రకారం, సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కేవలం మరో పది రోజుల షుటింగ్ మాత్రమే మిగిలి ఉందట. ఈ చివరి షెడ్యూల్‌లో కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు, స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించబోతున్నారు. ఇక్కడితో పెద్ది షుటింగ్ కంప్లీట్ అయిపోయినట్టే. ఇదే స్పీడ్‌లో మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే గిఫ్ట్‌గా పెద్ది టీజర్ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. అక్కడి నుంచి బ్యాక టు బ్యాక అప్డేట్స్‌తో ప్రమోషన్స్ స్పీడ్ పెంచనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ అయిన పాటలు సెన్సేషనల్ చార్ట్ బస్టర్ అయ్యాయి. అలాగే.. స్పెషల్ సాంగ్ కోసం రెహమాన్ అదిరిపోయే మాస్ బీట్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ పాటలో చరణ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి ఇద్దరు స్టార్ హీరోయిన్లను రంగంలోకి దింపుతున్నాడట బుచ్చిబాబు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.






Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787